

సహకారం.. ప్రక్షాళన

- ఐదేళ్లలో పూర్తిగా నిర్వీర్యమయిన సహకార సంఘాల సొసైటీలు
- వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే రుణాలు
- త్రీమెన్ కమిటీలను రాజకీయ పునరావాసాలుగా మార్చిన వైనం
- వాటి రద్దుకు కొత్త ప్రభుత్వం ఆదేశాలు
- పర్సన్ ఇన్‌చార్జిల నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఐదేళ్ల పాటు పీఏసీఎస్‌లన్నీ వైసీపీ నేతల కబంధ హస్తాల్లో ఉండిపోయాయి. ఎన్నికల ఊసే లేకుండా త్రీమెన్ కమిటీల పేరిట నామినేటెడ్ పోస్టుల్లో వైసీపీ నేతాగణాన్ని కూర్చోబెట్టి సహకార సంఘాల ఉద్దేశాన్నే దెబ్బతీసే విధంగా వ్యవహరించారు. రైతులకు రుణాలు ఇవ్వకుండా వారికి నచ్చిన వారికే సొసైటీ రుణాలు అందే విధంగా చూశారు. అభ్యంతరం తెలిపిన ఉద్యోగులను కూడా ఇష్టారీతిన బదిలీ చేసి తమ పబ్బాన్ని గడుపుకున్నారు. ఏటా జరిపే ఆడిట్‌లో అక్రమాలు వెలుగు చూస్తున్నప్పటికీ ఆ నివేదికలను సైతం బయటకు రాకుండా తొక్కిపెట్టారు. కోట్ల రూపాయలు పక్కదారి పట్టినా రికవరీ ఊసే లేకుండా పోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే సహకార సంఘాల రుణాల పేరిట వైసీపీ నేతలు పెద్ద ఎత్తున లబ్ధి పొంది అర్హులైన రైతుల నోట్లో మట్టి కొట్టారు.

బాపట్ల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం కొలువు దీరగానే ఈ సహకార సంఘాల ప్రక్షాళనపై దృష్టి పెట్టింది. పీఏసీఎస్(ప్రైమరీ అగ్రికల్చరల్‌క్రెడిట్ సొసైటీ)లో కొనసాగుతున్న త్రీమెన్ కమిటీలను వెంటనే రద్దు చేస్తున్నట్లు ఆదేశాలిచ్చింది. రాజీనామాకు కొంతమంది వైసీపీ నేతలు ససేమిరా అన్నప్పటికీ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం సాంకేతికంగా వారు పదవుల్లో లేనట్లే. ఆయా సొసైటీల్లో పర్సన్ ఇన్‌చార్జిల నియామకానికి సహకార శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే వారి నియామకం జరగనుంది.

2018లోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా..

సహకార సంఘాలకు చివరిసారి ఎన్నికలు 2013లో జరిగాయి. షెడ్యూల్ ప్రకారం 2018లో నిర్వహించాల్సి ఉంది. అప్పట్లో సొసైటీల పాలకవర్గాన్ని ఏడాది కాలం పాటు పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారు. 2019లో వైసీపీ ప్రభుత్వం గద్దెనెక్కగానే ఎన్నికల సంప్రదాయానికి తిలోదకాలిస్తూ సెవన్‌మెన్ కమిటీ, త్రీమెన్ కమిటీలపేరిట వైసీపీ నేతలను సొసైటీల్లోని పదవుల్లో నామినేటెడ్ ప్రాతిపదికన నియమిస్తూ వచ్చింది. ఆరునెలల కొకసారి వారి పదవీకాలం పొడిగించుకుంటూ వచ్చింది తప్పితే సొసైటీలకు ఎన్నికలు జరిపి పాలక వర్గాలను నియమించే ప్రయత్నం చేయలేదు. మధ్యలో ఒకట్రెండు సార్లు సహకార సంఘాలకు ఎన్నికలంటూ హడావిడి చేసి ఓటరు జాబితాలను కూడా సిద్ధం చేశారు. తర్వాత వాటిని పట్టించుకున్న పాపాన వైసీపీ పోలేదు.

ఐదేళ్లలో అనేక అక్రమాలు..

వైసీపీ నేతాగణమే సొసైటీ పదవుల్లో ఉండడంతో రుణాల విషయంలో అనేక అక్రమాలకు వారు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని పంగలూరు మండలం నూజెళ్లపల్లి సొసైటీలో లాకర్‌లో బంగారం లేకుండానే రైతుల



పంగలూరు మండలంలోని నూజెళ్లపల్లి పీఏసీఎస్ భవనం

పేరిట వైసీపీ నేతలే రూ.2.20 కోట్ల రుణాలు పొందిన బాగోతం గతంలో వెలుగు చూసింది. అది బయటపడడంతో అధికారుల హడావిడి తప్పితే రికవరీ మాటేలేదు. డీసీసీబీల పరిధిలో కొందరు బ్యాంకు అధికారులు, వైసీపీ నేతలు కుమ్మక్కై కోట్ల రూపాయల రుణాలను నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలతో రుణాలు పొందారన్న ఆరోపణలు గతంలో వచ్చాయి. ఉమ్మడి గుంటూరు డీసీసీబీ పరిధిలోనే దాదాపు రూ.80 కోట్లకు పైగానే సొమ్ము దుర్వినియోగమైందని రైతులు అంటున్నారు. ఉమ్మడి ప్రకాశం డీసీసీబీ కిందకు వచ్చే చీరాల, అద్దంకి, పర్చూరు సొసైటీల్లో కూడా పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని వాటన్నింటిపై సమగ్ర విచారణ జరగాలనే డిమాండ్లు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

ఉద్యోగులపైనా వేధింపులు..

అవినీతి ఆరోపణలే కాకుండా ఉద్యోగులను వేధించడంలో త్రీమెన్ కమిటీలు ఇష్టారీతిన వ్యవహరించాయి. రాజకీయ కారణాలతో ఎప్పటి నుంచో పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో వైసీపీ విధేయులకు పోస్టింగ్ ఇచ్చుకున్నారు. 2019 కన్నా ముందు సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేసేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పాత తేదీలు వేసి మరీ వారికి కొమ్ముకాసే ఉద్యోగులను రెగ్యులర్ చేశారన్న విమర్శలు అప్పట్లో వ్యక్తమయ్యాయి. రుణాల పేరిట స్వాహా చేసిన మొత్తాలతో పాటు ఉద్యోగుల రెగ్యులరైజ్ విషయంలో జరిగిన అవకతవకల విషయంలో సమగ్ర విచారణ దిశగా కొత్త ప్రభుత్వం ప్రక్షాళన మొదలెట్టింది.

ఆడిట్ నివేదికలపై దృష్టి...

ప్రతి ఏడాది సొసైటీల్లో చేపట్టే ఆడిట్ నివేదిక వివరాలను గత ప్రభుత్వం గోప్యంగా ఉంచింది. ఇప్పుడు కొత్త ప్రభుత్వం రావడంతో రాష్ట్రస్థాయిలోనే ఆ నివేదికలపై కదలిక ప్రారంభమైంది. ఆయా సొసైటీల్లో వాటికి సంబంధించిన నివేదికలపై తీవ్ర కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వైసీపీ నేతల సేవలో తరించిన వీరవిధేయ ఉద్యోగులు ఇప్పటికే సెలవుపై వెళ్లినట్లు సమాచారం. ఆడిట్ నివేదికలతో పాటు ఐదేళ్ల వ్యవధిలో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులు ఇవన్నీ బేరీజు వేసుకుని ఎక్క డెక్కడ అక్రమాలు జరిగాయన్న విషయం గుర్తించి వారిపై చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది.

పర్సన్ ఇన్‌చార్జిల నియామకం..

సొసైటీల్లోని కమిటీలన్నీ కూడా రద్దు కావడంతో సహకార సంఘాల్లో పర్సన్ ఇన్‌చార్జిల నియామకానికి ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. అక్కడ నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే ఉద్యోగులు ఆయా పోస్టుల్లో కొలువు దీరనున్నారు. ఇక కొత్త ప్రభుత్వం ప్రాధామ్యాల ప్రకారం సహకార సంఘాలకు ఎన్నికలు జరపడమా లేదా అనేది త్వరలోనే నిర్ణయం కానుంది. అప్పటి వరకు పర్సన్ ఇన్‌చార్జిల ద్వారా పాలన నడిపించనున్నారు. ఆయా సొసైటీల్లో ఐదేళ్ల వ్యవధిలో పొందిన రుణాలు, సదరు పేర్ల వివరాలపై ఇప్పటికే నూతన ప్రభుత్వం వివరాలు సేకరిస్తోంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 సహకార సంఘాలు..



బాపట్ల జిల్లాలో మొత్తం 112 పీఏసీఎస్‌లు ఉండగా వీటిలో 68 సొసైటీలు ఉమ్మడి గుంటూరు పరిధిలోని డీసీసీబీ కింద ఉండగా, 44 పీఏసీఎస్‌లు ఉమ్మడి ప్రకాశం పరిధిలోని డీసీసీబీ కింద ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే మొత్తం 167 సహకార సంఘాలు ఉన్నాయి. డీసీసీబీకి సెవన్‌మెన్ కమిటీలు, పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీలను నామినేటెడ్ పద్ధతిన వైసీపీ ప్రభుత్వం నియమిస్తూ వచ్చింది. ఈ కమిటీల్లో ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నేతాగణానికి చోటు కల్పించి ఇష్టారీతిన వ్యవహరించారు. నూతన ప్రభుత్వం కొలువుదీరగానే కొంతమంది వెంటనే రాజీనామాలు సమర్పించగా, ప్రభుత్వం జారీచేసిన జీవో ప్రకారం ఆ పదవులన్నీ రద్దయినట్లయింది. అన్ని కమిటీలకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తప్పుకోవాలనే నోటీసులు కూడా సహకార శాఖ పంపించింది.

నెరవేరిన కల

- మూడు జిల్లాల్లో 318 మంది గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవో అధికారాలు
- జీవో ఇచ్చి నాలుగు నెలలు తొక్కిపెట్టిన గత ప్రభుత్వం
- ఎన్నికల ముందు ఫిబ్రవరిలో హడావుడిగా జీవో జారీ
- కొత్త ప్రభుత్వం రాకతో ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు

గుంటూరు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల కల ఎట్టకేలకు నెరవేరింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వేళ వారికి డీడీవో అధికారాలు సొంతమయ్యాయి. 2019లో సచివాలయ పరీక్షల ద్వారా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 568 మందిని పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-5గా గత ప్రభుత్వం ఎంపిక చేసింది. కానీ వారందరినీ సచివాలయాలకే పరిమితం చేసి గ్రామ పంచాయతీ వ్యవస్థను నీరుగార్చింది. వందల సంఖ్యలో పంచాయతీలు ఖాళీగా వున్నా.. అంతకు మించిన సంఖ్యలో పంచాయతీ కార్యదర్శులు కళ్లెదుటే వున్నా వారికి అధికారాలు మాత్రం ఇవ్వలేదు. వారిని సచివాలయాల్లోనే ఉంచి జాబ్‌చార్టు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకుంది. ఫలితంగా కార్యదర్శులు లేక పంచాయతీల పనితీరు పూర్తిగా దెబ్బతింది. ఉద్యోగుల నుంచి ఒత్తిడి వస్తుండడంతో కార్యదర్శులకు అధికారాలు ఇస్తామని 2022లోనే వైసీపీ ప్రభుత్వం జీవో నెం.149 విడుదల చేసి హడావుడి చేసింది. ఆ తరువాత జీవోను బుట్టదాఖలు చేసింది. మరలా ఈ ఏడాది ఎన్నికలకు ముందు హడావుడిగా ఫిబ్రవరి 15న మరోమారు జీవో ఎంఎస్. నెం.11 పేరుతో మరో జీవో విడుదల చేసింది. అది కూడా అమలుకు నోచుకోలేదు.

నాలుగు నెలల క్రితమే జీవో..

నాలుగు నెలల క్రితమే ప్రభుత్వం జీవో ఇచ్చినా జిల్లా స్థాయిలో అధికారులు జీవోలను తొక్కిపెట్టారు. గత ప్రభుత్వానికి ఎన్నికల్లో లబ్ధి చేకూర్చాలన్న ఉద్దేశంతోనే తమకు విధులు కేటాయించకుండా తాత్సారం చేశారని గ్రేడ్-5 కార్యదర్శులు గతం నుంచి ఆరోపిస్తూనే ఉన్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్ వారి ఆరోపణలకు బలం చేకూర్చేలా వుంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 1230 గ్రామ పంచాయతీలు వుండగా, దాదాపు 700 మంది గ్రేడ్- 1, గ్రేడ్-2, గ్రేడ్-3, గ్రేడ్- 4 పంచాయతీ కార్యదర్శులు వున్నారు. 2019లో సచివాలయ పరీక్షల ద్వారా మరో 568 మందిని గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులు ఎంపికైనా వారికి విధులు కేటాయించలేదు. దీంతో వారంతా సచివాలయాల్లో, గ్రేడ్- 1- 4 కార్యదర్శుల సహాయకులుగా మాత్రమే మిగిలిపోయారు. డీడీవో పవర్ ఇవ్వలేదు. పంచాయతీ కార్యదర్శులకు ఉండే డీడీవో పవర్ మాటేమోగానీ, కనీసం జనన, మరణ, వివాహ నమోదు, ధ్రువీకరణ పత్రాల జారీ, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల వంటి ప్రాథమిక విధులు కూడా వారికి దక్కలేదు. దీంతో చాలా పంచాయతీల్లో సాధారణ పరిపాలన దెబ్బతింది. 'ఒక పంచాయతీ ఒక కార్యదర్శి' దస్త్రాలపై 2023 సెప్టెంబరులోనే అప్పటి ముఖ్యమంత్రి సంతకం చేసినప్పటికీ అది జిల్లాలో అమలుకు నోచుకోలేదు. పంచాయతీ కార్యదర్శులను వారి శాఖకు సంబంధించిన విధులకు పరిమితం చేయకుండా సంబంధం లేని అనేక విధులకు కేటాయిస్తున్నారు. అందులో భాగంగా దాదాపు 91 మందికి బీఎల్‌వో విధులు కేటాయించారు. ఆ విధులకు అటంకం ఏర్పడుతుందన్న కారణంగా అపాయింటింగ్ అథారిటీగా వున్న గుంటూరు జిల్లా కలెక్టర్ జీవోను అమలు చేయకుండా ఆపారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

318 మందికి పంచాయతీల కేటాయింపు

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో మొత్తం 318 మందికి ప్రత్యేకంగా గ్రామ పంచాయతీలు కేటాయించారు. ఇప్పటి వరకూ అమలులో ఉన్న క్లస్టర్ విధానాన్ని రద్దు చేసి, క్లస్టర్ పరిధిలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలకు ప్రత్యేకంగా ఒక పంచాయతీ కార్యదర్శిని కేటాయించారు. పల్నాడు జిల్లాలో అత్యధికంగా 159 పంచాయతీలకు, బాపట్ల జిల్లాలో 89 పంచాయతీలకు, గుంటూరు జిల్లాలో 70 పంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులను కేటాయించారు. కాగా ఇప్పటికే పంచాయతీల పరిధిలో పనిచేస్తున్నవారికి ఆయా పంచాయతీలనే ఖరారు చేశారు. కాగా రెండు, మూడు సచివాలయాలు ఉన్న మేజర్ పంచాయతీల్లో సీనియర్ కార్యదర్శిని యథాతథంగా కొనసాగిస్తున్నారు. కాగా సచివాలయాల్లో వున్న గ్రేడ్-5 కార్యదర్శులకు మాత్రం పంచాయతీలను కేటాయించలేదు. ఇలాంటి వారు 50 మంది వరకూ వున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు పోటీ పరీక్షలు, ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా సెలవుపై మరో 40 మంది వరకూ ఉండొచ్చని తెలుస్తోంది. వారందరికీ పోస్టింగు పెండింగులో వుంది. ఖాళీగా ఉన్న పంచాయతీలను గుర్తించి వారిని ఆ పంచాయతీలకు కేటాయిస్తామని అధికారులు చెబుతున్నారు.

నాలుగున్నరేళ్ల పోరాట ఫలితం..

మాకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు రుణపడి వుంటాం. గత ప్రభుత్వం మమ్మల్ని నియమించినా, సేవలను వినియోగించుకోలేదు. మానవ వనరులన్నీ వృథా అయిపోయాయి. ఈ ప్రభుత్వం దాన్ని గమనించి సరిచేసింది. మా సేవలు పూర్తి స్థాయిలో అందిస్తాం.

- బెజ్జం రోజా ప్రకాశ్, గ్రామ వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ ఫెడరేషన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు

వినియోగిస్తే.. ఉపయుక్తం

- రూ.25 కోట్లతో భవనాలు నిర్మించారు
- వినియోగం మరిచారు
- శిథిలావస్థకు చేరుకుంటున్న భవనాలు
- జిల్లా కార్యాలయాలకు కేటాయింపు ప్రతిపాదన బుట్టదాఖలు
- ప్రజా ధనం నిరూపయోగం



డబుల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్‌లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) రాజధాని అమరావతిలోని భవనాల తరహాలోనే నరసరావుపేటలో కూడా ప్రభుత్వ భవనాలను పాడుబెట్టారు. కోట్లు కుమ్మరించి నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న భవనాలను మందు బాబులు వారి అడ్డాగా మార్చుకున్నారు. . భవనాలకు తాగు నీరు, డ్రైనేజ్ కోసం పైపు లైన్‌లు ఏర్పాటు చేశారు. ఈ పైపులను కూడా అపహకరించుకుపోయారు. కొత్త జిల్లా ఏర్పాటైన సందర్భంగా 2022లో రాజీవ్ స్వగృహ భవనాలను కార్యాలయాలకు వినియోగించుకోవాలని నిర్ణయించారు. వసతుల ఏర్పాటు కోసం నిధుల విడుదల చేయాలని నాటి ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలను బుట్టదాఖలు చేశారు. దీంతో జిల్లా కార్యాలయాలను అద్దె భవనాలలో నిర్వహిస్తున్నారు.

- మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇంటి కల నెర వేర్చే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రాజీవ్ స్వగృహ పథకాన్ని ప్రవేశపెట్టింది. నరసరావుపేటలో 1,118 మంది సొంత ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. చాలినంత స్థలం లేకపోవటంతో బహుళ అంతస్థుల తరహాలో గృహాలు నిర్మించి ఇవ్వాలని నాడు ప్రభుత్వం నిర్ణయించింది. 2009లో నరసరావుపేటలోని లింగంగుంట్ల కాలనీలో నీటి పారుదల శాఖ స్థలంలో నిర్మాణాలను చేపట్టారు. మూడు బ్లాక్‌లలో అపార్ట్‌మెంట్లు నిర్మించారు. ఇందుకు దాదాపు ప్రభుత్వం రూ.25 కోట్లు అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి ఖర్చు చేసింది.
- ఐదు ఎకరాల స్థలంలో అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపట్టారు. 672 గృహాలను నిర్మించాలని కార్పొరేషన్ ప్రణాళిక రూపొందించింది. ఇందు కోసం రూ.70 కోట్లు వ్యయం అంచనాలను రూపొందించారు. అప్పట్లో ప్రభుత్వం నుంచి అరకొరగా నిధులు విడుదల కావడంతో మూడు బ్లాక్‌లలో 252 ఫ్లాట్‌ల నిర్మాణం చేపట్టారు. వీటిలో 168 రెండు బెడ్‌రూమ్ ఫ్లాట్‌లు, 84 సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్‌లు నిర్మించారు. సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్ 523 చదరపు అడుగుల్లో, 757 చదరపు అడుగుల్లో డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు నిర్మించారు. డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ ధరను రూ.11.60 లక్షలుగా, సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్ రూ.7.90 లక్షలుగా కార్పొరేషన్ రేటు నిర్ణయించింది. ఈ అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్‌లు కొనుగోలు చేసేందుకు పట్టణ వాసులు ఆసక్తి కనబరచలేదు. దీంతో భవనాలు నిరుపయోగంగా మారాయి.

ప్రభుత్వం స్పందించాలి

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు గత ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కలెక్టరేట్‌తో పాటు ఇతర శాఖల కార్యాల యాలు ఒకే ప్రాంగణంలో నిర్మించాలని నిర్ణయించింది. అయితే ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్‌కు పక్కనే స్వగృహ భవనాలను ఉన్నాయి. భవనాలకు మౌలిక వసతులు కల్పిస్తే పోలీసు శాఖతో పాటు అన్ని శాఖల జిల్లా కార్యాలయాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కొత్త భవనాలు నిర్మించే దాని కన్నా ఉన్న భవనాలు వినియోగంలోకి తీసుకువస్తే ప్రభుత్వంకు కోట్లలో నిధులు ఆదాఅవుతాయి. ఈ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు భావిస్తున్నారు. ఈ మేరకు జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీ స్పందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇస్తే జిల్లా కార్యాలయాలకు భవనాల సమస్య త్వరతగతిన పరిష్కారం అవుతుంది.

జిల్లా కార్యాలయాలకు భవనాలను కేటాయించారు.

రాజీవ్ స్వగృహ భవనాలలో దాదాపు 37 జిల్లా కార్యాలయాలకు భవనాలను కేటాయించారు. ఈ మేరకు బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. కార్యాలయాలకు మౌలిక వసతులు కల్పించేందుకు రూ.2.70 కోట్ల వ్యయం అంచనాతో కలెక్టర్ ప్రతిపాదనలు పంపారు. నిధులు విడుదల చేయకపోవడంతో ఈ భవనాల విని యోగాన్ని విరమించుకు న్నారు. ఆయా కార్యాలయాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు.





ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేశ్ బీ లత్కర్

వినతుల స్వీకరణకు అనూహ్య స్పందన

నరసరావుపేట టౌన్, జూన్ 24: నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం ప్రారంభం అయింది. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వహిస్తున్న తొలి ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. నూతన ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు నడుచుకోవాలని, ప్రజా ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ శ్రీకేశ్ బీ లత్కర్ సూచించారు. ప్రజల నుంచి కలెక్టర్ తోపాటు జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం వినతులు స్వీకరించారు. మొత్తం 50 వినతులు వచ్చాయి. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు.



సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు

మాచర్లటౌన్, జూన్ 24: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సోమవారం వెలగపూడి సచివాలయంలో పల్నాడు జిల్లాలోని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, పెదకూరపాడు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావులు కలిశారు. ఈ సందర్భంగా భారీ మెజార్టీతో విజయం సాధించిన ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందించారు. పల్నాడు ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలను ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికా బద్ధంగా పల్నాడు ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చినట్లు ఎమ్మెల్యేలు తెలిపారు.

భారత వాయుసేనలో అగ్నివీరులు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది.

పోస్టు: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ - అగ్నివీర్ వాయు

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో మేథమెటిక్స్ ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్(10+2)/ఇంటర్మీడియట్ (సైన్స్ కాని ఇతర సబ్జెక్టులు) లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/ కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) తత్సమాన ఉత్తీర్ణత. నిర్దిష్ట శారీరక దారుడ్య/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3 మధ్య జన్మించి ఉండాలి.

ఎత్తు: పురుషులు 152.5 సెం.మి.; మహిళలు 152 సెం.మీ. ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఫేజ్-1(ఆన్‌లైన్ రాత పరీక్ష), ఫేజ్-2(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్-1, అడాప్టబిలిటీ టెస్ట్-2), ఫేజ్-3(మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్), ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

పరీక్ష ఫీజు: రూ.550

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: జూలై 8

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూలై 28

ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం: అక్టోబరు 18

వెబ్‌సైట్: agnipathvayu.cdac.in/AV/



దిక్సూచి DIKSUCHI

మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్(ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ)- 'మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఎంపీహెచ్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ(మెడిసిన్/ఆయుష్/డెంటిస్ట్రీ/నర్సింగ్/ఫార్మసీ/వెటర్నరీ సైన్స్/ ఫిజియోథెరపీ/ఆక్యుపేషనల్ థెరపీ/న్యూట్రిషన్/ఫార్మకాలజీ/అలైడ్ అండ్ హెల్త్ సైన్సెస్/ లైఫ్ సైన్సెస్/బయోటెక్నాలజీ/స్టాటిస్టిక్స్/బయో స్టాటిస్టిక్స్/మేనేజ్‌మెంట్/ఇంజనీరింగ్/డెమోగ్రఫీ/ పాపులేషన్ స్టడీస్/సోషియాలజీ/సైకాలజీ/ఆంత్రోపాలజీ/సోషల్ వర్క్/ఎకనామిక్స్/లా) ఉత్తీర్ణులై ఉండాలి.

○ **చివరి తేదీ:** జూలై 9

○ **వెబ్‌సైట్:** www.nihfw.ac.in

50వ జీ-7 సమావేశం

ఆహ్వానిత దేశంగా భారత్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(నిన్నటి దిక్సూచి తరువాయి)

జీ-7 విశిష్టత: జీ-7 దేశాలన్నీ పారిశ్రామికంగా, ఆర్థికంగా, శాస్త్ర సాంకేతికపరంగా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలుగా ఉన్నాయి.

- అంతేకాక ఇవి ప్రపంచంలోనే అత్యధిక బంగారం నిల్వలు, అణుశక్తి ఉత్పత్తి కలిగిన దేశాలు. అధిక ఎగుమతులు కలిగిన దేశాలు.
- ఐక్యరాజ్య సమితికి నిధుల వితరణపరంగా శక్తిమంతమైన దేశాలు.
- ప్రపంచ జనాభాలో పదిశాతం మాత్రమే కలిగి ప్రపంచ నికర సంపదలో మాత్రం 60 శాతం మూటగట్టుకున్న ధనిక దేశాలు.

జీ-7 లక్ష్యం: ప్రాథమికంగా జీ-7 లక్ష్యం ఆర్థిక, రాజకీయపరమైన అంతర్జాతీయ అంశాలపరంగా సభ్యదేశాలకు సంబంధించి ఉమ్మడి వ్యూహాలను రచించడమే అయినప్పటికీ కాలక్రమంలో ఈ లక్ష్యాల పరిధి విస్తరించి అంతర్జాతీయ ఆర్థిక స్థిరత్వం, ప్రపంచ భద్రత, శక్తి/ఇంధన వనరుల సంబంధిత అంశాలు, పర్యావరణం, సామాజిక భద్రత వంటి అనేక కీలక అంశాలకు స్థానం లభిస్తోంది.

జీ-7 భారతదేశం: కొంతకాలంగా వరుసగా ఈ సమావేశాలకు ఆహ్వానాన్ని అందుకుంటున్న భారత్ జీ-7 యవనికపై తన ముద్రను వేస్తూనే ఉంది. కొవిడ్ మహమ్మారి విజృంభణను అరికట్టేందుకు భారత్ జీ-7 47వ సమావేశంలో 'వన్ ఎర్త్, వన్ హెల్త్' అనే నినాదంతో 'సమష్టి కృషి' ఆవశ్యకతను చాటిచెప్పింది. కొవిడ్ టీకా పరిశోధనల్లో, ముడి పదార్థాల అందుబాటులో దేశాల మధ్య సహకారాన్ని పెంచేందుకు కృషిచేసింది. అదేవిధంగా టీకాల అందుబాటు పెంచేందుకు అడ్డంకిగా ఉన్న ట్రిప్స్ నిబంధనలను తొలగించాలని డబ్ల్యూటీఓ(ప్రపంచ వాణిజ్య సంస్థ)లో దక్షిణాఫ్రికాతో కలిసి దాఖలు చేసిన విజ్ఞప్తిని జీ-7 దేశాల మద్దతుకు కృషిచేసింది. అదేవిధంగా 2023లో జపాన్‌లోని హిరోషిమాలో జరిగిన గత సదస్సులో ప్రధాని మోదీ మూడు ప్లీనరీ సమావేశాల్లో పాల్గొని ప్రపంచశాంతి, వాతావరణ మార్పుల నిరోధం, ఇతరత్రా బహుముఖ సంక్షోభాలపరంగా భారతవాణిని వినిపించారు. ఈ సమావేశంలో భారత్ కొన్ని అంతర్జాతీయ చొరవలకు మార్గదర్శనం చేసింది. భారత్ ప్రతిపాదించిన లైఫ్ స్టయిల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్, మిల్లెట్స్ అండ్ అదర్ ఏన్షియంట్ గ్రైన్స్ ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇనీషియేటివ్ వంటి చొరవలు 'హిరోషిమా యాక్షన్ ప్లాన్ ఫర్ రిసైలియంట్ గ్లోబల్ ఫుడ్ సెక్యూరిటీ'లో గుర్తించారు.

జీ-7 భారత్ మధ్య పరస్పర అవసరాలు

- భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలోనే అయిదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించింది. జీ-7లోని సగం దేశాలకు పైగా(కెనడా, ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్‌ల కన్నా కూడా) పెద్ద ఆర్థికవ్యవస్థ అయినందున జీ-7, భారత్ మధ్య సంబంధం పరస్పర లాభదాయకంగానే ఉంటుంది.
- ప్రస్తుతం ప్రాధాన్యం పొందుతున్న హిందూ-పసిఫిక్ ప్రాంత భౌగోళిక రాజకీయాల్లో గ్లోబల్ సౌత్‌కు ప్రాతినిధ్యం వహించే భారత్ భాగస్వామ్యం వ్యూహాత్మకంగా చాలా కీలకం. హిందూ-పసిఫిక్ ప్రాంతంలో విస్తరిస్తున్న చైనా ఆధిపత్యాన్ని నిలువరించడానికి జీ-7 కూటమికి భారత్ అవసరం ఉండగా, చైనాను ధీటుగా ఎదుర్కోడానికి బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌కు ప్రత్యామ్నాయాలు తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్న జీ-7 మద్దతు భారత్‌కు అంతే అవసరం ఉంది.
- శాస్త్ర సాంకేతికరంగాల్లో, క్లీన్ ఎనర్జీ/పునరుత్పాదక శక్తిరంగం, డిజిటల్ టెక్నాలజీ వంటి రంగాల్లో ముందు వరుసలో ఉన్న జీ-7 దేశాలకు మద్దతు భారత్‌కు అవసరం. అదేవిధంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశం అత్యధిక జనాభాతో కూడిన అతి పెద్ద మార్కెట్‌ను జీ-7 దేశాలకు అందిస్తోంది.
- ప్రపంచ శాంతి సామరస్యాలు కాపాడటానికి, వాతావరణ మార్పుల కట్టడి చర్యలకు, ఆర్థిక నేరాలు, ఉగ్రవాదం, సముద్ర మార్గాల రక్షణ వంటి అనేక ఉమ్మడి సమస్యలపై పోరాడటానికి అభివృద్ధి చెందిన జీ-7 దేశాల కూటమికి, అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ సౌత్ దేశాల ప్రతినిధిగా భారత్‌కు మధ్య సమన్వయానికి దోహదపడుతుంది.
- జీ-7 సమావేశాల నేపథ్యంలో జరిగే వివిధ దేశాలతో భారత్ ద్వైపాక్షిక సమావేశాలు భారత్‌కు పలు దేశాలకు మధ్య వాణిజ్య, రక్షణ, దౌత్య సంబంధాలను బలపర్చడానికి ఒక చక్కని అవకాశం.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/yknNzixలో చదవండి.



పవన్‌కల్యాణ్‌ను కలసిన తెలుగు సినిమా నిర్మాతలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను సినీ పరిశ్రమ తరపున అభినందించేందుకు అపాయింట్‌మెంట్ కోరడానికి వచ్చామని నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో పలువురు నిర్మాతలు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కీలక అంశాలపై వారు చర్చించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ తరపున పవన్ కల్యాణ్‌ను అభినందించడానికి అపాయింట్‌మెంట్ కోరడానికి వచ్చామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అదే విధంగా సీఎం చంద్రబాబుతో భేటీ కావడానికి అపాయింట్ ఇప్పించాలని కోరినట్టు తెలిపారు. దీనిపై చంద్రబాబుతో మాట్లాడి చెబుతానని పవన్ కల్యాణ్ తెలిపినట్టు వివరించారు. తెలుగు చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించ లేదని, త్వరలోనే మరోసారి కలసి చిత్ర పరిశ్రమ సమస్యలు, రాష్ట్రంలో సినీ రంగం విస్తరణకు ఉన్న అవకాశాలపై చర్చిస్తామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, నిర్మాతలు సి.అశ్వనీదత్, ఎ.ఎం.రత్నం, డి.సురేష్ బాబు, ఎస్.రాధాకృష్ణ(చిన బాబు), దిల్‌రాజు, భోగవల్లి ప్రసాద్, డి.వి.వి.దానయ్య, సుప్రియ, ఎన్.వి.ప్రసాద్, బన్నీ వాసు, నవీన్ ఎర్నేని, నాగవంశీ, టి.జి.విశ్వప్రసాద్, వంశీకృష్ణ, వై.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)

28 ఏళ్ల తర్వాత...



సరిగ్గా 28 ఏళ్ల క్రితం 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రం విడుదలైంది. చిరంజీవి సోదరుడు పవన్‌కల్యాణ్‌కు, ఏయన్నార్ మనవరాలు సుప్రియకు ఇదే తొలి సినిమా. ఈవీవీ సత్యనారాయణ దర్శకుడు , అల్లు అరవింద్ నిర్మాత. ఆ సినిమా తర్వాత హీరోగా ఎదిగి పవన్‌కల్యాణ్ పవర్‌స్టార్ అయ్యారు. సుప్రియ మాత్రం నటనకు క్రమంగా దూరమై, నిర్మాణరంగంలోకి ప్రవేశించి అక్కడే స్థిరపడ్డారు. సోమవారం ఇతర నిర్మాతలతో పాటు సుప్రియ కూడా పవన్‌కల్యాణ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వీరిద్దరూ దిగిన ఫొటో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. కొందరైతే 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రంలోని వీరిద్దరి ఫొటోను.. ఇప్పటి ఫొటోను జతచేసి.. సూపర్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్‌ను సీనియర్ నిర్మాత కె.ఎస్.రామారావు సోమవారం అమరావతిలో కలసి అభినందించారు. త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో సమావేశమై సినీ రంగ సమస్యలను చర్చిద్దామని దుర్గేశ్ రామారావుకు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందుతుందనీ, అందుకు సహజమైన లొకేషన్లు, ప్రోత్సహించే ప్రభుత్వం ఉన్నాయని రామారావు తెలిపారు. సినిమా పరిశ్రమ పట్ల అవగాహన కలిగిన దుర్గేశ్ మంత్రిగా ఉన్నందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు.

విశ్వంభర సెట్‌కు వినాయక్




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' షూటింగ్ ప్రస్తుతం అన్నపూర్ణ సెవెన్ ఏకర్స్‌లో వేసిన భారీ సెట్‌లో జరుగుతోంది. దర్శకుడు వి.వి.వినాయక్ సోమవారం ఈ సెట్‌కు వెళ్లారు. మెగాస్టార్ చిరంజీవిని కలసి కాసేపు ముచ్చటించారు. ఆయనతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని పంచుకున్నారు. దర్శకుడు వశిష్టకు, చిత్ర నిర్మాతలకు అభినందనలు తెలిపారు వినాయక్. మెగాస్టార్ చిరంజీవి, వినాయక్, వశిష్ట కలసి ఉన్న ఫొటోని చిత్రం టీమ్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. యూవీ క్రియేషన్స్ సంస్థ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. విక్రమ్, వంశీ, ప్రమోద్, నిర్మిస్తున్నారు.

ఒకే తెరపై రజనీ, సల్మాన్



'రాజారాణి', 'తెరి', 'మెర్సల్', 'బిగిల్' చిత్రాలతో సూపర్‌హిట్ డైరెక్టర్ అనిపించుకున్న అట్లీ కుమార్.. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి షారుక్ ఖాన్ చిత్రం 'జవాన్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు. ఆయన ప్రస్తుతం సల్మాన్ ఖాన్‌తో ఓ చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా అందిన సమాచారం మేరకు ఈ సినిమాలో రజనీకాంత్ కూడా నటించనున్నారు. ఇలా ఒకే తెరపై వీరిద్దరూ కనపడితే.. వారి అభిమానుల ఆనందాలకు హద్దులు ఉండకపోవడమే కాకుండా అది బాక్సాఫీస్‌కు కూడా పండుగ వాతావరణాన్ని తెప్పిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ఇందులో రజనీ ఏ పాత్రను పోషిస్తున్నారో ఇంకా తెలియాల్సి ఉంది. ఈ చిత్ర నిర్మాత, సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్‌కు సూపర్‌స్టార్‌తో ఉన్న సత్సంబంధాల వల్లే ఈ ప్రాజెక్ట్‌లో నటించేందుకు రజనీ పచ్చజెండా ఊపారని తెలుస్తోంది. ప్రస్తుతం 'సికిందర్' షూటింగ్‌లో సల్మాన్, 'కూలీ' చిత్రీకరణలో బిజీగా ఉన్న రజనీ.. ఆ ప్రాజెక్ట్ పూర్తి కాగానే ఈ సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు.



వైజయంతి పాత్రలో మళ్లీ!

విజయతార విజయశాంతి 34 ఏళ్ల క్రితం 'కర్తవ్యం' చిత్రంలో పోలీస్ ఆఫీసర్ వైజయంతి పాత్రను పోషించారు. ఆ చిత్రం ఆమె నట జీవితాన్ని సరికొత్త మలుపు తిప్పడమే కాకుండా జాతీయ స్థాయిలో ఉత్తమ నటిగా అవార్డు తెచ్చి పెట్టింది. ప్రస్తుతం నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా నటిస్తున్న చిత్రంలో విజయశాంతి 'కర్తవ్యం' తరహాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నారు. ఆమె పాత్ర పేరు కూడా వైజయంతి కావడం గమనార్హం. విజయశాంతి పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా ఆమె గెటప్ రివీల్ చేశారు. ఈ పోస్టర్‌తోనే ఆమె పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో తెలియజేశారు. అలాగే గ్లింప్స్‌ను కూడా రిలీజ్ చేశారు. 'వైజయంతి ఐపీఎస్.. తను పట్టుకుంటే పోలీస్ తుపాకీకే ధైర్యం వస్తుంది.. వేసుకుంటే యూనిఫామ్‌కే పౌరుషం వస్తుంది. తనే ఒక యుద్ధం.. నేనే తన సైన్యం' అంటూ కల్యాణ్‌రామ్ వాయిస్ ఓవర్‌తో విజయశాంతి పాత్రను పరిచయం చేశారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు.

బాలీవుడ్‌లోకి శ్రీలీల



క్యూట్ బ్యూటీ శ్రీలీల బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్నారు. డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వరుణ్‌ధావన్ నటించబోయే చిత్రానికి శ్రీలీలను ఖరారు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రాన్ని జూలై నుంచి సెట్స్‌పైకి తీసుకువెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నారు. కథాంశంగా ట్రయాంగిల్ లవ్ స్టోరీని ఎంచుకున్నారని.. కన్‌ఫ్యూజన్, కామెడీ కలగలసిన ఈ చిత్రం ప్రేక్షకులని కడుపుబ్బా నవ్వించేలా ఉంటుందట. టైటిల్, ఇతర తారాగణం, సాంకేతిక సిబ్బంది ఇంకా ఖరారు కాని ఈ చిత్రాన్ని రమేశ్ తౌరని నిర్మించనున్నారు. ఇటువంటి క్రేజీ ప్రాజెక్ట్‌తో బాలీవుడ్‌లోకి ఎంటర్ అవుతున్నందున.. ఇక బీ టౌన్‌లో కూడా ఆమె కెరీర్‌కు ఢోకా ఉండదని అంటున్నారు. డేవిడ్ ధావన్, వరుణ్ ధావన్ కలయికలో ఇదివరకు 'మై తేరా హీరో', 'జుడ్వా 2' చిత్రాలు వచ్చి.. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టాయి.

ట్రెండ్‌కు అనుగుణంగా..



'హను-మాన్' చిత్రంతో ఈ ఏడాది ప్రారంభంలో బ్లాక్ బస్టర్ హిట్ సాధించిన చిత్ర నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ ఇప్పుడు ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా నిర్మిస్తున్న 'డార్లింగ్' చిత్రం జులై 19న విడుదల కానుంది. అశ్విన్‌రామ్ ఈ చిత్రానికి దర్శకుడు. రోమ్ కామ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమాతో మరోసారి హిట్ సాధిస్తామని నిర్మాతలు నిరంజన్‌రెడ్డి, చైతన్య చెబుతున్నారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణమైన అంశాలతో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించడానికి ఈ చిత్రం సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణతేజ్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి నరేశ్ రామదురై సినిమాటోగ్రాఫర్. హేమంత్ సంభాషణలు రాశారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2czlCy9 లో చదవండి.

సూర్యలంక తీరంలో పర్యటన నిషేధం

● అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో..



సూర్యలంక తీరానికి పర్యాటకులు వెళ్ళకుండా రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

బాపట్లరూరల్, జూన్ 24: బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరానికి సోమవారం పర్యాటకుల నిషేధాన్ని అధికారులు ప్రకటించారు. తీరానికి వాహనాలు, పర్యాటకులు వెళ్ళకుండా సూర్యలంక రహదారిపై పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అలలు ఉధృతి ఎక్కువగా ఉండటంతో గత 2, 3 రోజుల్లోనే 15మంది యువకులు గల్లంతు కాగా మెరైన్ రూరల్ పోలీసులు, గజఈతగాళ్ళు ఆ యువకులను కాపాడి ప్రాణాలను రక్షించారు. సూర్యలంకతీరంలో పోలీసు బందోబస్తును డీఎస్పీ మురళీకృష్ణ పరిశీలించారు నాలుగైదు రోజుల తర్వాత పర్యాటకులు స్నానాలు చేసేందుకు అనుమతించటం జరుగుతుందని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. జిల్లాలోని సముద్రతీరప్రాంతాలకు యాత్రీకుల అనుమతి తాత్కాలికంగా నిషేధిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైసీపీ కార్యకర్తలకు ముందస్తు బెయిల్ నిరాకరణ

నరసరావుపేట లీగల్, జూన్ 24 : వైసీపీ కార్యకర్తలకు కోర్టు ముందస్తు బెయిలు నిరాకరించింది. గత నెల 13న సాధారణ ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న హింసాత్మక ఘటనల్లో మల్లమ్మ సెంటర్‌లో బొలేరో వాహనాన్ని దహనమైంది. ఈ కేసులో నిందితులైన పట్టణంలోని అరండల్‌పేటకు చెందిన శివరాత్రి అశోక్ కుమార్, వడ్డెర కాలనీకి చెందిన బండారు సాయి మహేష్‌లకు ముందస్తు బెయిల్‌ను నిరాకరిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

10 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా

రెంటచింతల, జూన్ 24: మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న 10మంది ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేశారు. వారి సిమ్ కార్డులను ఏపీవో స్వాధీనం చేసుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డిపై ఫిర్యాదు



రొంపిచర్ల ఎస్ఐ రవీంద్రకు ఫిర్యాదు అందజేస్తున్న గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల, జూన్ 24: మండలంలోని రెడ్డిపాలెం గ్రామానికి చెందిన గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై సోమవారం రొంపిచర్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2022లో బార్ షాపులో తనకు వాటా ఇప్పిస్తానని చెప్పి రూ.20లక్షలు గోపిరెడ్డి తీసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనకు వాటా ఇప్పించకపోవటంతో 2023లో తన డబ్బు తనకు ఇవ్వాలని అడిగినందుకు అక్రమ మద్యం కేసు పెట్టి తనకు జైలుకు పంపించాడని పేర్కొన్నాడు. ఫిర్యాదును ఎస్ఐ కేపీ రవీంద్రకు అందజేశాడు. తనకు తగిన న్యాయం చేయాలని కోరాడు.

అరాచక ఖాకీల ఆగడాలు

● ఒక్కొక్కటిగా వెలుగులోకి...
● చేయని నేరానికి పోలీసుల దాడిలో గాయపడ్డ బాధితులు
● ముడుపులు తీసుకున్నప్పటికీ వదిలిపెట్టకుండా కేసుల నమోదు
● వెలుగుచూస్తున్న వెల్దుర్తి పోలీసుల దాష్టీకాలు



బాధితులు హరికృష్ణ, ఆంజనేయులు



వైసీపీ రౌడీషీటర్ మన్నెయ్యతో కానిస్టేబుల్ చలమయ్య(వృత్తంలో..)

మాచర్ల రూరల్, జూన్ 24: గత ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వంలో వెల్దుర్తి మండలంలో పోలీసులు చేసిన ఆగడాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పోలీసుల ఒత్తిడికి తట్టుకోలేక కొంతమంది పార్టీ మారగా, మరికొందరు బలవన్మరణంకు పాల్పడిన ఘటనలు కూడా ఉన్నాయి. వైసీపీ నేతలు చెప్పిందే తడవుగా టీడీపీ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేయడంతోపాటు ఆర్థికంగా కూడా నష్టపరిచారు. ప్రధానంగా మండాది గ్రామంలో గత ఆరు నెలల క్రితం జరిగిన ఓ చోరీ కేసులో అనుమానితులుగా అదే గ్రామంలోని రజక సామాజిక వర్గానికి చెందిన అన్నదమ్ములైన రాయళ్ల హరికృష్ణ, ఆంజనేయులును వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అప్పటి ఎస్ఐ శ్రీహరితో పాటు కానిస్టేబుల్ చలమయ్యలు వారిని చిత్రహింసలకు గురిచేశారు. ఒంటిపై నూలుపోగు లేకుండా చేసి బూటుకాళ్లతో తొక్కిపట్టి పంగ చీల్చి దెబ్బలు బయటకు కానరాకుండా నరకం చూపించినట్లు బాధితులు వాపోయారు. పోలీసుల చిత్రహింసలకు హరికృష్ణ స్పృహ కోల్పోగా హరికృష్ణను స్టేషన్ నుంచి బయటకు తీసుకురావడానికి నలుగురు సాయంతో మోసుకురావాల్సి వచ్చింది. నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నాలుగైదు రోజులు ఐసీయూలో అత్యవసర వైద్య చికిత్స అందించిన పిదప హరికృష్ణ కోలుకున్నారు. ఆసుపత్రిలో వైద్య చికిత్సకు రూ.లక్షన్నర దాకా వెచ్చించాల్సి వచ్చింది. ఇప్పటికీ తమపై ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా చేయని నేరానికి అన్నదమ్ములిరువురిని పోలీసులకు చిత్రహింసలకు గురి చేయడం మానసిక క్షోభకు గురి చేస్తోందని బాధితులు వాపోతున్నారు.

మరికొన్ని గ్రామాల్లో...

అలాగే రచ్చమలపాడుకు చెందిన ఓ వ్యక్తిపై మహిళ ఫిర్యాదు చేసింది. అయితే అతని వద్ద భారీ మొత్తంలో నగదు తీసుకొని స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు. ఇది అవకాశంగా తీసుకొని వైసీపీ నాయకులు ఎస్ఐ శ్రీహరికి ఫోన్ చేసి మరలా సదరు వ్యక్తిని పోలీస్‌స్టేషన్లో వేయించారు. మరసపెంటకు చెందిన గిరిజనులపై అక్రమ మద్యం సరఫరా చేస్తున్నారంటూ స్టేషన్‌కు పిలిపించి చిత్రహింసలకు గురి చేశారు. వారు పెద్ద మొత్తంలో నగదు పోలీసులకు ముట్టజెప్పడంతో కేసు కూడా నమోదు చేయకుండా పంపించారు. అలాగే జెండాపెంటకు చెందిన మత్స్యకారుడు దుర్గారావుపై కూడా మద్యం కేసు నమోదు చేయడంతో హైకోర్టుకు వెళ్లి బెయిలు తెచ్చుకున్నారు. అయినప్పటికీ తరచూ స్టేషన్‌కు రమ్మని ఫోన్ చేయడంతో పోలీసులు కొడతారనే భయంతో దుర్గారావు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అప్పట్లో సంచలనం రేపింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో టీడీపీ గిరిజన నేతపై కేసు నమోదుతో పాటు పెద్ద మొత్తంలో డబ్బులు గుంజినట్లు సమాచారం. ఈ సంఘటనలోనే ఓ అధికారి వద్ద భారీ ఎత్తున ముడుపులు పుచ్చుకొని ప్రైవేటు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వెల్దుర్తి పోలీస్‌స్టేషన్లో జరిగిన దాష్టీకాలకు సంబంధించి బాధితులు ఒక్కొక్కరిగా బయటకు వస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత మంది బాధితులు బయటకు వచ్చే అవకాశం ఉంది. వెల్దుర్తి మండలంలో వైసీపీ నేతలతో అంటకాగుతూ టీడీపీ సానుభూతిపరులను హింసలకు గురిచేసిన ఎస్ఐ శ్రీహరి, కానిస్టేబుల్ చలమయ్యలు అధిక మొత్తంలో ముడుపులు రూపంలో దండుకొని ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం జరిగిందని, వారివురు అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

సస్పెండైనా తీరుమారలేదు...

దుర్గి మండలంలోని శ్యామరాజపురంలో అక్రమ మద్యం విక్రయిస్తున్నారంటూ ఓ వ్యక్తిపై తప్పుడు కేసు పెట్టి అప్పటి దుర్గి ఎస్ఐ రామాంజినేయులుతోపాటు కానిస్టేబుల్ చలమయ్యలు 2021లో సస్పెండ్ అయ్యారు. తరువాత చలమయ్య అప్పటి అధికార పార్టీ వైసీపీ నేతల అండదండలతో వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు చేరాడు. ఎస్ఐ శ్రీహరికి రైట్ హ్యాండ్‌గా ఉండి వైసీపీ నేతల ప్రోద్బలంతో టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించడం, భారీ స్థాయిలో ముడుపులు తీసుకొని చిత్రహింసల పాలు చేశారు.

రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేస్తా

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, జూన్24: పొన్నూరు నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా అవినీతి రేషన్ మాఫియాతో వచ్చిన చెడ్డపేరును మాఫియాలకు అడ్డుకట్ట వేయటం ద్వారా మార్పు చూపిస్తామన్ని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ స్పష్టం చేసారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ పరిధిలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పనుల గురించి నివేదికలను కోరారు. రెవెన్యూ శాఖ సమీక్షలో నరేంద్ర మాట్లాడుతూ ఎన్నికల ముందు హడావుడిగా నివేశన స్థలాల కోసం ఆఫ్‌లైన్‌లో చేసిన దరఖాస్తుల రిజిస్ట్రేషన్ల వివరాలను అందచేయాలని ఆదేశించారు. కాలనీలో ఇళ్ల నిర్మాణానికి కేటగిరి 3 క్రింద నియమించిన ఏజెన్సీలకు ఏ ప్రాతిపదికన నిర్మాణ కాంట్రాక్టు ఇచ్చారని ప్రశ్నించారు. లబ్ధిదారులకు కాంట్రాక్టర్లకు మధ్య ఒప్పందాలు చేయటంలో ఎందుకు ఆసక్తి చూపించారని ప్రశ్నించటంతో అధికారుల వద్ద సమాధానం లేదు. నిర్మాణసామగ్రి తరలించిన ఘటనపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్వాక్రా సమీక్ష సందర్భంగా ఐదేళ్ల కాలంలో జరిగిన అవకతవకలు సరిచేయాలని ఆదేశించారు. విద్యుత్‌శాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండటమే కాకుండా ప్రజాసమస్యలు పరిష్కరించాలని సూచించారు. అగ్రికల్చర్ల మోటార్ల విద్యుత్ కనెక్షన్ల మంజూరు సమయంలో వసూళ్లు నిల్పివేయాలని ఆదేశించారు. అలాగే గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. గత పాలకుల అవినీతి మత్తు నుంచి అధికారులు బయటపడాలని ఎమ్మెల్యే హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో పి.రత్నజ్యోతి, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలీసులకు బంగారం వ్యాపారి బురిడీ

● డబ్బు ఎగ్గొట్టేందుకు ఎత్తుగడ వేసిన నిందితుడు
● చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులు





వివరాలు వెల్లడిస్తున్న సీఐ కళ్యాణ్‌రాజు
ఇన్‌సెట్లో సీజ్ చేసిన నకిలీ బంగారం, సెల్ ఫోన్

తాడేపల్లి, జూన్ 24: తాను ఇవ్వాల్సిన డబ్బులు ఎగ్గొట్టేందుకు బావకే టోపీ పెట్టబోయి ప్లాను బెడిసి కొట్టడంతో పోలీసులకు చిక్కిన ముద్దాయి అతని అనుచరుల ఉదంతమిది. ఈ మేరకు తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు సోమవారం సాయంత్రం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. మంగళగిరికి చెందిన గోల్డ్ వ్యాపారి గుర్రంకొండ రాము గోల్డ్ వ్యాపారం చేస్తుంటాడు. తన వ్యాపార అవసరాల నిమిత్తం తన బావ, ఫిర్యాది అని పసుపులేటి వీరాంజనేయులు నుంచి రూ.90లక్షల మేర దఫదఫాలుగా నగదు తీసుకున్నాడు. తిరిగి ఆ డబ్బుల గురించి వీరాంజనేయులు అడుగుతుండగా రాము ఇవ్వకుండా కాలయాపన చేస్తూ నగదు ఎగ్గొట్టేందుకు పథకం రచించాడు. ఈ క్రమంలో ఈ నెల 19న వీరాంజనేయులుకు ఫోన్ చేసి హైదరాబాద్‌నుండి వస్తున్నాను, బంగారం తెస్తున్నాను. దానిని నీకు ఇవ్వవలసిన డబ్బుల తాలూకు తీసుకోమని, విజయవాడ ఆర్‌టిసి బస్టాండ్‌కు రమ్మని చెప్పగా ఫిర్యాది తన మోటారు సైకిల్‌పై విజయవాడ వెళ్లి రామును తీసుకుని బండిపై వస్తుండగా కొలనుకొండ మోడల్ డెయిరీ వద్దకు వచ్చేసరికి ముగ్గురు వ్యక్తులు మరో బైక్‌పై వీరిని ఫాలో అవుతూ రాము చేతిలో ఉన్న బ్యాగును లాక్కొని పరారయ్యారు. దీంతో వీరాంజనేయులు తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నార్త్ డీఎస్పీ రవికాంత్ ఆధ్వర్యంలో తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు, ఎస్ఐ ప్రతాప్‌లు కేసు దర్యాప్తు చేపట్టగా సదరు రాము తన బావకు ఇవ్వాల్సిన డబ్బులు ఎగ్గొట్టేందుకు రత్న, బబ్లూ అలియాస్ శరత్‌బాబు, మహబూబ్ బాషా, ప్రసన్న అనే వారిని సంప్రదించి నకిలీ బంగారం తీసుకుని విజయవాడ నుంచి వస్తానని మార్గమధ్యలో బ్యాగు దొంగిలించి వెళ్లాలని రూ.10లక్షలు ఇస్తానని అడ్వాన్సుగా రూ.50వేలు ఇచ్చి కేసు అయితే చూసుకుంటానని వారితో చెప్పగా వారు అంగీకరించారు. దీంతో వారు ప్లాను అమలుకు రాము వాహనాన్ని అనుసరిస్తూ అతని వద్ద ఉన్న బ్యాగును దొంగిలించి పరారయ్యారు. పోలీసులు కేసును ఛేదించి కేసుతో ప్రమేయమున్న రాము, రత్న, బబ్లూ, మహబూబ్ బాషాలను సోమవారం అరెస్టు చేసి వారి నుంచి నాలుగు నకిలీ బంగారు బిస్కెట్లు ఒక మొబైల్‌ను స్వాధీనపరచుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ప్రమేయమున్న మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ కళ్యాణరాజు తెలిపారు.

వైసీపీ అక్రమ నిర్మాణంపై నోటీసులు

● వారం రోజుల్లో వివరణ ఇవ్వాలి

బాపట్ల, జూన్24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా బాపట్ల పట్టణంలో నిర్మించిన వైసీపీ జిల్లా కార్యాలయ భవనంపై మున్సిపల్ విభాగం దృష్టి సారించింది. ఆ భవన నిర్మాణానికి ప్లాన్ సహా ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా పరిగణించి నోటీసులు ఇవ్వడానికి రంగం సిద్ధం చేశారు. సోమవారమే తాఖీదులు సిద్ధమయినప్పటికీ కొన్ని సంతకాలతో పాటు వైసీపీ జిల్లా అధ్యక్షులు అందుబాటులో లేకపోవడం వల్ల కూడా మంగళవారం నోటీసులు ఇవ్వనున్నారు. నోటీసులకు వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని, అప్పటికీ స్పందించకపోతే తదుపరి తీసుకునే చర్యలను వివరిస్తూ మరోసారి నోటీసులు ఇస్తామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత ప్రభుత్వ ఆదేశాలను బట్టి భవనాన్ని వేరే అవసరాలకు ఉపయోగించడమో లేక కూల్చివేయడమా అనే నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని వివరించారు. మరో వైపు లీజు వ్యవహారంపై రెవెన్యూ విభాగం కూడా దృష్టి సారించింది. నామమాత్రపు అద్దెకు స్థలాన్ని లీజుకు తీసుకున్నప్పటికీ ఆ మొత్తాన్ని కూడా ఇప్పటివరకు చెల్లించలేదని తెలుస్తోంది. దీనిపై కూడా త్వరలోనే నోటీసులు ఇచ్చి వివరణ అడిగే అవకాశం ఉన్నట్లు సమాచారం

రాజప్రాసాదం లాంటి భవనంపై ప్రజల్లో చర్చ...

వైసీపీ జిల్లా కార్యాలయం పేరిట రాజప్రసాదం లాంటి భవనం నిర్మించడం పట్ల ప్రజల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. మరో వైపు పట్టణం నడిబొడ్డున విలాసమైన భవంతి నిర్మాణం జరుగుతుంటే ఎలాంటి అనుమతులు లేవని మున్సిపల్ విభాగం తాపీగా ఇప్పుడు చెప్పడం వైసీసీకి వ్యవస్థల గులాంగిరీకి నిదర్శనంగా కనబడుతోంది. భవనం పూర్తయి విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత నోటీసులంటూ హడావిడి చేయడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆ భవనం నిర్మించేటప్పుడు వైసీపీ ప్రాపకం కోసం ఉదాసీనంగా వ్యవహరించిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలడే డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

25, 26 తేదీల్లో నాలుగు రైళ్ల పునరుద్ధరణ

గుంటూరు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాలతో గతంలో నాలుగు రైళ్లను రద్దు చేసిన రైల్వే శాఖ వాటిని పునరుద్ధరించింది. నెంబరు. 12805 విశాఖపట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 23 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు, తిరిగి సెప్టెంబరు 16 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు రద్దు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇప్పుడు దానిని పక్కన పెట్టి ఈ నెల 25వ తేదీ నుంచి ఈ రైలుని యధాతథంగా నడుపుతామని ప్రకటించారు. నెంబరు.12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ని గతంలో జూన్ 24 నుంచి ఆగస్టు 11, సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 16వ తేదీ వరకు రద్దు చేశారు. ఇప్పుడు ఈ రైలుని ఈ నెల 26వ తేదీ నుంచి పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు. నెంబరు. 17463 చెంగల్‌పట్టు - కాకినాడ పోర్టు సర్కారు ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 23 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు గతంలో రద్దు చేయగా దీనిని కూడా ఈ నెల 25 నుంచి పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. నెంబరు.17644 కాకినాడ పోర్టు - చెంగల్‌పట్టు సర్కారు ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 24 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు రద్దు చేయగా ఇప్పుడు దీనిని ఈ నెల 26 నుంచి పునరుద్ధరిస్తున్నట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు.

సెప్టెంబరు నెలాఖరు వరకు ప్రత్యేక రైళ్ల సర్వీసుల పొడిగింపు

గుంటూరు మీదగా ప్రయాణిస్తున్న పలు ప్రత్యేక రైలు సర్వీసులను సెప్టెంబరు నెలాఖరు వరకు పొడిగించినట్లు డీఆర్ఎం తెలిపారు. నెంబరు. 07609 పూర్ణ - తిరుపతి రైలుని జూలై 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు, నెంబరు. 07610 తిరుపతి - పూర్ణ రైలు జూలై 2 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. నెంబరు. 07632 నరసపూర్ - హైదరాబాద్ రైలుని జూలై 7 నఉంచి సెప్టెంబరు 29వ తేదీ వరకు, నెంబరు. 07445 కాకినాడ టౌన్ - లింగంపల్లి రైలుని జూలై 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు, నెంబరు. 07446 లింగంపల్లి - కాకినాడ టౌన్ రైలు జూలై 2 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు.

సీజీజీబీకి ప్రతిష్ఠాత్మక అవార్డు



ఏపీవై అవార్డును అందుకుంటున్న సీజీజీబీ ఛైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి తదితరులు

గుంటూరు, జూన్ 24: న్యూ ఢిల్లీలో పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) నిర్వహించిన వార్షిక ఫెలిసిటేషన్ కార్యక్రమంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సీజీజీబీ) ప్రతిష్ఠాత్మక అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) అవార్డుతో సత్కరించటం జరిగింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈవో ఎ.మణిమేఖలై హాజరై ఈ అవార్డు సీజీజీబీ అత్యుత్తమ పనితీరు, నిబద్ధతకు గుర్తింపని ప్రశంసించారు. సీజీజీబీ బ్యాంక్ ఛైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును బ్యాంకు ఉద్యోగులకు అంకితం చేస్తూ, ఈ సందర్భంగా ఉద్యోగుల కృషి, బ్యాంకు అభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. ఈ అవార్డు ఆర్థిక చేరికను ప్రోత్సహించటం, వినియోగదారులకు అద్భుతమైన సేవలందించినందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ డాక్టర్ బీవీ రమణారావు తదితరులున్నారు.

గణపవరంలో రెండు ఇళ్ళలో చోరీ

● రూ.10 లక్షల విలువైన సొత్తు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

నాదెండ్ల, జూన్ 24: మండలంలోని గణపవరం గ్రా మంలో రెండు ఇళ్ళల్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో రూ.10 లక్షల విలు వైన సొత్తును దుండగులు ఎత్తుకు వెళ్ళారు. ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగు చూసింది. గ్రామంలోని మువ్వావారి వీధిలో నివాసం ఉంటున్న పాలచర్ల వెంకట రఘు రామిరెడ్డి గ్రామంలోని ఒక ప్రైవేట్ మిల్లులో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. తన మనుమరాలు పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు భార్యతో కలసి ఈనెల 19న హైదరాబాద్ వెళ్ళాడు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి వచ్చిన వారు ఇంటి వెనుక తలుపులు, బీరువాలు తీసి ఉండటాన్ని గుర్తించారు. బీరువాలోని రూ.2.30 లక్షలు నగదు, సుమారు ఏడు సవర్లకు పైగా బంగారు ఆభరణాలు, సుమారు రెండు కిలోల వెండి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కాగా సినిమా హాల్ రోడ్డులో నివాసం ఉంటున్న చిలుకూరి రమేష్ కుమారుడు అమెరికా నుంచి వచ్చాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులందరూ కొన్ని రోజులుగా గుంటూరులో ఉంటున్నారు. సోమవారం ఇంటికి వచ్చి చూడగా డోర్ లాక్‌లు, గేట్ల తాళాలు పగల గొట్టిన విషయాన్ని గుర్తించాడు. ఇంట్లో ఎలాంటి ఆభరణాలు, విలువైన వస్తువులు లభించక పోవటంతో దుండగులు గడ్డపారను అక్కడే పడవేసి పరారయ్యారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ వేలి ముద్రల నమూనాలను సేకరించింది. చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ జే బాలరామిరెడ్డి, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు చోరీ జరిగిన ఇళ్ళను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

55 క్వింటాళ్ళ రేషన్ బియ్యం స్వాధీనం



కొమెరపూడి విఘ్నేశ్వర రైస్ మిల్లులో స్వాధీనం చేసుకున్న బియ్యంతో విజిలెన్స్ అధికారులు

సత్తెనపల్లి, జూన్ 24: సత్తెనపల్లి మండలం కొమెరపూడిలోగల విఘ్నేశ్వర రైస్ మిల్లులో అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచిన 55 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, స్థానిక సివిల్ సప్లయిస్ అధికారులు విఘ్నేశ్వర రైస్ మిల్లుపై దాడి చేసి తనిఖీలు నిర్వహించారు. గుమస్తా కృష్ణారెడ్డిని అధికారులు విచారించారు. 110 బస్తాల్లో నిల్వ ఉంచిన 55 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. మిల్లు యజమాని గంగాధరరెడ్డిపై 6(ఏ) కేసు నమోదుచేయాలని స్థానిక సివిల్ సప్లయిస్ డీటీ అరుణను విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులరెడ్డి, ఏ శ్రీహరిరావు, సత్తెనపల్లి సివిల్ సప్లయిస్ డీటీ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

జీవో నం.117ను రద్దు చేయాలి

● విద్యామంత్రికి నోబుల్ టీచర్స్ అసోసియేషన్ వినతి



మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌టీఏ రాష్ట్ర కార్యదర్శి హైమారావు

గుంటూరు(విద్య), జూన్ 24: ప్రాథమిక పాఠశాలలకు శరాఘాతంగా మారిన జీవోనం 117ను రద్దు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసి యేషన్ (ఎన్‌టీఏ) నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం అమరావతిలోని సచివాలయంలో విద్యామంత్రి నారా లోకేశ్‌ను కలిసి రాష్ట్ర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరావు, బి.హైమారావు తదితరులు వినతి పత్రం అందజేశారు. ప్రాథమిక విద్యకు ఆటంకంగా జీవో 117 మారిందని, అనేక స్కూల్స్ మూతపడుతున్నాయని పేర్కొన్నారు. దీనిని రద్దు చేసిన ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సంఘం నాయకులు మంత్రి నారా లోకేశ్‌ను సత్కరించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	136, 147,156
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

40,696 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 45,769 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 40,696 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 17,563 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తెల్లకాయలు	4500	12000
334	8000	16500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14500	334	9000	18000
273	11000	14500	నెంబరు. 5	13500	13500
341	9000	17000	341	9000	18000
4884	--	--	4884	10500	16500
సూపర్ 10	--	--	**ఏసీ స్పెషల్ వెరైటీ**		
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తేజ	10000	19700
తేజ	7500	20000	బ్యాడిగి	9500	15000
బ్యాడిగి	9000	16000	దేవనూరుడీలక్స్	15000	15000
దేవనూరుడీలక్స్	10000	15500	తెల్లకాయలు	5500	11000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



డీజీపీ తిరుమలరావును సత్కరిస్తున్న పల్నాడు జిల్లా ఎమ్మెల్యేలు

డీజీపీని కలిసిన పల్నాడు జిల్లా ఎమ్మెల్యేలు

పెదకూరపాడు, జూన్ 24: డీజీపీ కార్యాలయంలో సోమవారం డీజీపీ ద్వారక తిరుమలరావును పల్నాడుజిల్లా ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. కలసినవారిలో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, పెదకూరపాడు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ఉన్నారు.

ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేదు

- డీఎస్సీ నోటిఫికేషన్ జారీతో సరిపుచ్చిన వైసీపీ ప్రభుత్వం
- టీడీపీ రాష్ట్ర నేత ఎలినేడి రామ స్వామి
- ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి క్యాబినెట్ ఆమోదంపై హర్షం

సత్తెనపల్లి, జూన్ 24 : గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో ఒక టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామ స్వామి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేవలం ఎన్నికల ముందు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించిందన్నారు. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. గత ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా టెట్ నిర్వహించలేదన్నారు. దీని వల్ల మార్కులు పెంచుకొనే అవకాశం నిరుద్యోగులకు లభించలేదన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం చూస్తే చాలు గత ప్రభుత్వ పాలన తెలిసి పోయిందన్నారు. కేంద్రం చెప్పిన దానికి, రాష్ట్రం అమలు చేసిన దానికి పొంతన లేదన్నారు. ఈ చట్టం వల్ల చిన్న, సన్న కారు రైతులు సమస్యలు ఎదుర్కొన్నారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు నిర్ణయాన్ని క్యాబినెట్ ఆమోదించటం హర్షణీయమన్నారు. కూటమి ప్రభుత్వం రైతులందరికీ ఒరిజనల్ డాకుమెంట్లను అందిస్తుందన్నారు. పించన్ మొత్తం రూ 4వేలకు పెంచటం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. పేద వాడికి నాణ్యమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో అన్నా క్యాంటీన్‌లను ప్రభుత్వం మళ్ళీ ప్రారంభిస్తుందన్నారు. ప్రజా సంక్షేమమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు.



తుమ్మకోట లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో శోభారాణి

కార్యకర్తల కష్టానికి ప్రతిఫలం లభించింది

రెంటచింతల, జూన్ 24: నెలల తరబడి పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తల కష్టానికి ప్రతిఫలమే జూలకంటి బ్రహ్మారెడ్డికి బ్రహ్మారెడ్డికి అఖండ మెజార్టీ సాధించిపెట్టిందని ఆయన సతీమణి శోభారాణి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని తుమ్మకోటలో ఆమె పర్యటించారు. తొలుత లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేశారని, వారిని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటామన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ చేరువయ్యేలా నేతలు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాజకీయాలను ఎన్నికల వరకే పరిమితం చేసుకొని మిగతా సమయాల్లో గ్రామాల అభివృద్ధికి తోడ్పడదామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నలబాలునాయక్, సతీష్, మాధవరావు, లింగా పున్నారావు, అనిల్, రాజారెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కన్నాను సత్కరిస్తున్న టీడీపీ బెల్లంకొండ మండల నాయకులు

కన్నాకు టీడీపీ మండల నేతల సత్కారం

బెల్లంకొండ, జూన్ 24 : సత్తెనపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణను గుంటూరులోని తన నివాసంలో సోమవారం మండల టీడీపీ నేతలు కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు నాగమణిబాయి, మాజీ జడ్పీటీసీ తులిశానాయక్, మాజీ సర్పంచ్ హనుమంతరావు నాయక్, ఎంపీటీసీ నరసింహానాయక్ పాల్గొన్నారు.

కౌలు రైతులు సాగు హక్కు పత్రం పొందాలి

నకరికల్లు, జూన్ 24 : భూములను కౌలుకు తీసుకొని పంటలను సాగు చేస్తున్న కౌలు రైతులందరూ తప్పనిసరిగా పంట సాగుదారు హక్కు పత్రాలను పొందాలని వ్యవసాయ అధికారి కే.దేవదాసు కోరారు. సోమవారం చీమలమర్రి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కౌలు రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏవో మాట్లాడుతూ కౌలు రైతులు ఈ హక్కు పత్రం పొందటం వల్ల ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల పంట నష్ట పోయినప్పుడు ప్రభుత్వం అందించే పరిహారం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో రమణారెడ్డి, వీఏఏ వీ జగదీష్, సర్పంచ్ బత్తుల ఉపేంద్ర, వీరయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల వాహనం బోల్తా

- 10 మందికి స్వల్పగాయాలు.. తిరుపతి వెళ్లి వస్తుండగా ప్రమాదం

ఒంగోలు(క్రైం), జూన్24: ప్రయాణికుల వాహనం బోల్తా పడి పది మందికి స్వల్పగాయాలు అయ్యాయి. ఈ సంఘటన సోమవారం ఉదయం 5.30 గంటలకు జాతీయ రహదారిపై స్థానిక కొప్పోలు ఫ్లై ఓవర్ వద్ద జరిగింది. వివరాలలోకి వెళితే ఏపీ 39టియఫ్ 4657 నంబరుగల వాహనంలో పెదకూరపాడు మండలం కాసానిపాలెంనకు చెందిన 16 మంది తిరుపతి వెళ్లి తిరిగి వస్తున్నారు. వాహనం నడుపుతున్న డ్రైవర్ నిద్ర మత్తులో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి లెఫ్ట్‌సైడ్ మార్జిన్‌లో దింపడంతో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. వాహనంలో 8 మంది మహిళలు 8 మంది పురుషులు ఉన్నారు. వీరిలో పెదకూరపాడు హుసేన్‌నగర్ కు చెందిన మంచాల వెంకటేశ్వర్లుతో పాటు కాసానిపాలెం నకు చెందిన వీరాస్వామి, ఆది, సుజాత, పద్మ, రామాంజనేయులు, సుబ్బారెడ్డి, రాంబాబు ,ఆంజనేయులు, గోపిలకు స్వల్పగాయాలు ఆయాయి. వెంటనే వారిని 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని తాలుకా పోలీసులు పరిశీలించారు.

సాగుహక్కు పత్రాలపై

అవగాహన

బెల్లంకొండ, జూన్ 24 : మండలంలోని మాచాయపాలెం, పాపాయపాలెం గ్రామాల్లో పంట సాగు దారు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఏవో కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంకొండ తహసీల్దార్ ప్రసాదు మాట్లాడుతూ భూ యజమానుల హక్కులకు భంగం కలగకుండా పంట సాగుదారు హక్కు పత్రాలు జారీచేయనున్నట్లు తెలిపారు. భూ యజమానులు పంట సాగు దారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సైదయ్య, వీఆర్వోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గురువులు లేరు.. చదువులు ఎలా..?



మండల విద్యావనరుల కేంద్రం కార్యాలయం

- ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో పోస్టు భర్తీ శూన్యం
- ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల ప్రవేశాల్లో తగ్గుదల
- పదికి పైగా పాఠశాలకు ఉపాధ్యాయులు జీరో..
- డిప్యుటేషన్లతోనే కాలం వెళ్లదీస్తున్న వైనం
- సీఎం మొదటి సంతకంతో చిగురిస్తున్న ఆశలు

వెల్దుర్తి, జూన్ 24: అసలే విద్యాపరంగా వెనుకబడిన వెల్దుర్తి మండలంలో ఉపాధ్యాయుల కొరత విద్యపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. ఉపాధ్యాయుల భర్తీ ఊసే ఎత్తలేదు. జిల్లాకు సుదూరంగా ఉన్న ఈ మండలానికి నూతన డీఎస్సీ వస్తే తప్ప పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్న సందర్భాలు లేవు. 2014-2019 మధ్య కాలంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉపాధ్యాయుల భర్తీ చేశారు. అప్పుడు పూర్తిస్థాయిలో ఉన్న ఉపాధ్యాయులు మూడేళ్ల ఇక్కడ విధులు నిర్వహించిన అనంతరం బదిలీలు, సిఫార్సులపై సొంత ప్రాంతాలకు వెళ్లారు. సహజంగా ట్రాన్స్‌ఫర్లు జరిగే సమయంలో ఈ మండలం నుంచి వెళ్లే వారే తప్ప మండలానికి వచ్చేందుకు ఉపాధ్యాయులు చాలా అరుదుగా ఆప్షన్లు పెట్టుకుంటారు. విద్యకు ఎంతో విలువనిచ్చే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలి సంతకమే డీఎస్సీ ఫైల్‌పై చేశారు. దీంతో కొత్తగా రిక్రూట్ అయ్యే ఉపాధ్యాయులతో వెనుకబడిన ఈ మండలంలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు అందుబాటులోకి వస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశలో ఎదురు చూస్తున్నారు.

గత ప్రభుత్వం విద్యాపరంగా తీసుకున్న కొన్ని అనాలోచిత నిర్ణయాలతో ప్రతి యేటా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు తగ్గుతూ వస్తున్నారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 2022లో 6379 మంది విద్యార్థులు ఉండగా, 2023 నాటికి 5275 మందికి తగ్గారు. 2024లో ఉపాధ్యాయుల కొరత ప్రభావం తమ పిల్లల చదువుపై పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పూర్తిగా ప్రైవేటు పాఠశాల్లో చేర్పించేందుకు మొగ్గు చూపారు. ప్రస్తుతం పాఠశాలలు తెరిచే నాటికి 4383 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మండల పరిధిలో మొత్తం జిల్లా పరిషత్ హైస్కూల్‌లు 6, ఎంపీయూపీలు 2, ఎంపీపీఎస్‌లు 37, మోడల్ స్కూల్ 1, కేజీబీవీ 1, ఆశ్రమ పాఠశాలలు 2, జీపీఎస్ (గవర్నమెంట్ ట్రైబల్ ప్రైమరీ స్కూల్)లు 3 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో రెగ్యులర్‌గా 56 మంది, ఎంటీఎస్ (మినీమం టైం స్కేల్) ఉపాధ్యాయులు 26 మంది ఉన్నారు. వీరిలో కొంత మంది బదిలీలో ఉండగా, ఇక్కడ ఉపాధ్యాయుల కొరతతో రిలీవ్ ఇవ్వలేదు. జెండాపెంట, బొటుకుల పాయ, శివలింగాపురంతో పాటు మరో 10 పాఠశాలల్లో ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేకపోవడంతో మరో పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపి కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది. శిరిగిరిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 412 మంది విద్యార్థులకు సుమారు 21 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా 9 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. అలాగే వెల్దుర్తి జడ్పీహెచ్‌ఎస్‌లో 290 మంది విద్యార్థులకు గాను 19 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా 9 మంది మాత్రమే ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ అంటూ రూ. కోట్లు ఖర్చు పెట్టి 'నాడు-నేడు' పనులను ప్రాంభించిన గత వైసీపీ ప్రభుత్వం ఆయా కాంట్రాక్టర్ల జేబులు నింపిందే కానీ విద్యార్థుల విద్యాభివృద్ధిపై ఏ మాత్రం దృష్టి సారించిన పరిస్థితి లేదని పలువురు బాహాటంగానే విమర్శించారు. అలాగే పాఠశాలల విలీనం పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది విద్యార్థులను చదువుకు దూరం చేసిన పరిస్థితిని ఉపాధ్యాయ సంఘాల నేతలు తప్పుపట్టిన సందర్భాలు ఉన్నాయి. కొత్త ప్రభుత్వ పాలనలోనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు మండలంలో పాఠశాలల విద్య పటిష్ఠతపై దృష్టి సారించాలని, నూతన డీఎస్సీలో నైనా ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని మండల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పంచాయతీలకు పూర్తిస్థాయి కార్యదర్శులు..

క్రోసూరు, జూన్ 24: క్రోసూరు మండలంలో ఇప్పటి వరకు గ్రేడు - 5 పంచాయతీ కార్యదర్శులుగావున్న ఐదుగురిని పూర్తి స్థాయి పంచాయతీ కార్యదర్శులుగా డ్రాయింగ్ పవర్స్‌తో నియమిస్తున్నట్లు ఈవోపీఆర్డీ శివరామయ్య తెలియజేశారు. గరికపాడు కార్యదర్శి నాగ శేషగిరి, గాదేవారిపాలెం కార్యదర్శి కే.లక్ష్మీ ప్రసన్న, ఏ.ఉమా శంకర్(ఉయ్యందన), జే.ప్రకాష్(విప్పర్ల), ఎం హరికృష్ణ(బాలెమర్రు) కార్యదర్శులను పూర్తి స్థాయి కార్యదర్శులుగా నియమించామన్నారు. దొడ్లేరు-2 పంచాయతీ కార్యదర్శి టీ.సాంబిరెడ్డి, క్రోసూరు-2 పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజావలి, క్రోసూరు-3 పంచాయతీ కార్యదర్శి షేక్ రమీజ్‌లకు కూడా వచ్చే ఖాళీలను అనుసరించి పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించనున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ముప్పాళ్ళ జూన్ 24: గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం అర్ధరాత్రి తర్వాత జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. క్రోసూరు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ మీరయ్య(50) ద్విచక్రవాహనంపై నరసరావుపేట వచ్చి తిరిగి వెళుతుండగా గోళ్ళపాడు చప్టా వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మీరయ్య అక్కడిక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య లక్ష్మీ, కుమారుడు సాగర్, శిరి ఉన్నారు. పోలీసులు ఘటనాప్రాంతాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

'నేను బడికి పోతా..' ఇంటింటి ప్రచారం

ముప్పాళ్ళ జూన్ 24: మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో రామాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు 'నేను బడికి పోతా..' కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. అనంతరం ఒకటవ తరగతి విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో తోకల అచ్చయ్య, ఉపాధ్యాయులు ముప్వా సురేష్, టీ వేణుమాధవి, సతీష్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నకరికల్లు: మండలంలోని కండ్లకుంట ఎంపీపీఎస్ ఎస్సీ కాలనీ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు 'నేను బడికి పోతా..' కార్యక్రమంపై సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఐదు సంవత్సరాలు నిండి బడి మాని వేసిన 14 సంవత్సరాల లోపు పిల్లలందరినీ తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సూచించారు. ర్యాలీలో హెచ్‌ఎం ఎంబీ రత్నకుమారి, ఉపాధ్యాయులు ఎస్ మల్లికార్జునరావు, బాలస్వామి, వైవీ సత్యనారాయణ, సేవా సంస్థ డైరెక్టర్, న్యాయవాది జీ కన్నారావు పాల్గొన్నారు.



ఇన్‌చార్జి సర్పంచ్ రామాంజనేయులును అభినందిస్తున్న గ్రామ పెద్దలు

ఇన్‌చార్జి సర్పంచ్‌గా రామాంజనేయులు

క్రోసూరు, జూన్ 24: మండలంలోని నాగవరం గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్‌గా సీహెచ్ రామాంజనేయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈవోపీఆర్డీ శివరామయ్య రామాంజనేయులు చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇప్పటి వరకు సర్పంచ్‌గా ఉన్న బోసుల ప్రభావతి సెలవు పెట్టడంతో ఆమె స్థానంలో ఇప్పటి వరకు ఉప సర్పంచ్‌గా ఉన్న రామాంజనేయులు ఇన్‌చార్జి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రామాంజనేయులును టీడీపీ నేతలు నాగవరం జాన్, ఎంపీటీసీ సభ్యుడు షేక్ మస్తాన్, జనసేన జిల్లా నేతు యర్రంశెట్టి రామకృష్ణ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రత్నరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫాం, బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాజు తదితరులు

విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ

పెదకూరపాడు, జూన్ 24 : పెదకూరపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం స్కూల్ బ్యాగ్‌లు, యూనిఫాం, బెల్టు, బూట్లు తదితర సామగ్రితో కూడిన విద్యాకిట్లను సర్పంచ్ గుడిపూడి రాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాకాణి వెంకట రమణ, ఉపాధ్యాయులు రాయపూడి సాంబశివరావు, మేడా రాధాకృష్ణ, పీడీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నకరికల్లు : కుంకులగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు హెచ్‌ఎం మేరీ రాణి స్టూడెంట్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సింగరాజు అంకారావు, ఎస్‌ఎంసీ చైర్మన్ కోనా నాగేశ్వరరావు, చేపూరి వెంకటేశ్వర్లు, ఆవుల సుబ్బయ్య, రుసుం కోటయ్య, గోపు శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

అలాగే నకరికల్లులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చల్లగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్ విద్యాకిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ కొండవీటి లక్ష్మీ, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కే.రంగాదేవి, పీఎంసీ చైర్మన్ వెంకట రమణ, జూనెబోయిన వీరాంజనేయులు, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు అందజేస్తున్న టీడీపీ నేతలు

విజయపురిసౌత్: స్థానిక క్యాంపు-2 పాఠశాలలో టీడీపీ నేతలు సోమవారం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, పలకలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు, మైలపల్లి అప్పలరాజు, డాక్టర్ బసివిరెడ్డి, ఆడెపు కోటయ్య, తోటకూర పరమేశ్వరరావు, సత్తిబాబు, కట్టా రాజు, ఎమ్మార్పీఎస్ నేత ఊరే మార్కు, షేక్ మస్తాన్, సీహెచ్ అప్పలరాజు, రాంచంద్, నరసింహులు, రాజారావు, శివ, యేసు, చేపల భూలోక, పండు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యకు మహర్దశ

రెంటచింతల,జూన్ 24: పాలనారంగంలో అపారమైన అనుభవం వున్న చంద్రబాబు పాలనలో ప్రభుత్వ విద్యారంగం మరింత పురోగమిస్తుందని తుమ్మకోట గ్రామ సర్పంచ్ నలబాలునాయక్ అన్నారు. సోమవారం మండల పరిషత్ మెయిన్ స్కూల్లో 180 మంది బాల బాలికలకు విద్యాకిట్లు అందచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కే.వెంకటేశ్వరరావు, పోట్ల సతీష్, మాధవరావు, సాంబశివరావు, మీరా, రామారావు, మల్లికార్జున, అనిల్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒక అర్జీ

సత్తెనపల్లి రూరల్, జూన్ 24 :స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంనకు ఒక అర్జీ వచ్చినట్టు తహసీల్దార్ సీహెచ్ ఉషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని కంకణాలపల్లికి చెందిన రైతు సాంబశివరావు తన పట్టాదారు పాసుపుస్తకానికి ఆధార్ నంబర్ లింక్ చేయాలని కోరినట్లు తహసీల్దార్ తెలిపారు.

పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలి

- ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ వెంకటేశ్వర్లు
- పంచాయతీ కార్యదర్శులు, శానిటేషన్ అధికారులతో సమీక్ష

పిడుగురాళ్ల, జూన్ 24: గ్రామాలలో తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ శానిటేషన్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తాగు నీటి సరఫరాలో తగిన జాగ్రత్తలు పాటించకుంటే నీరు కలుషితమయ్యే అవకాశం వుంటుందని, దీంతో ప్రజలు పలు అనారోగ్య సమస్యల బారినపడే ప్రమాదం ఉందన్నారు. ఎంపీడీవో సుబ్బారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ అలెక్స్‌లు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ శానిటేషన్



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు

అధికారులు పట్టణంలో పారిశుధ్యం మెరుగుదల కోసం ప్రతి రోజు తగిన సమయం కేటాయించాలని, ఎక్కడైనా తాగునీటి కాలుష్యం, పారిశుధ్య లోపం తలెత్తితే తగిన చర్యలు తీసుకోవాల్సి వుంటుందని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిపారు.సమావేశంలో ఈవోపీఆర్డీ సీహెచ్ భార్గవ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లతో ఎమ్మెల్యే ప్రవీణ్

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం..

- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్
- రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లతో భేటీ

పెదకూరపాడు, జూన్ 24 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సోమవారం రాష్ట్ర సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నియోజక వర్గ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు ప్రవీణ్ తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు. అలాగే రాష్ట్ర సచివాలయంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా లోకేశ్‌ను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందించి లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీడీపీ నేత వంగవీటి రాధాకృష్ణను విజయవాడలోని వారి నివాసంలో భాష్యం ప్రవీణ్ కలిశారు.

కొనసాగుతున్న వైద్యశిబిరం

దాచేపల్లి, జూన్ 24: మండలంలోని కేశానుపల్లి గ్రామంలో అతిసార ప్రబలడంతో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపు కొనసాగుతుంది. సోమవారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో వింజమూరి కమలమ్మ, వినుకొండ కోటయ్య, సోముల అమరయ్యల పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం నరసరావుపేట, గుంటూరు తరలించారు. గ్రామంలో ఏర్పడిన సమస్యలపై దాచేపల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీర్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాల్లోని మంచినీటి ట్యాంక్‌లను శుభ్రపరచాలని, పైపులైన్లు లీకులు లేకుండా చూసుకోవాలని, డ్రెయినేజి వ్యవస్థను మెరుగుపరచాలని, తాగునీటిలో క్లోరినేసన్ వాడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఈవోపీఆర్డీ జోష్‌రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

కౌలు కార్డులతో ఎలాంటి ఇబ్బంది లేదు

- భూ యజమానులతో జడ్పీటీసీ శివయాదవ్

మాచవరం, జూన్ 24: రైతులు కౌలుదారులకు భూమి పత్రాలు ఇచ్చినందువలన భూ యజమానికి ఎలాంటి ఇబ్బందివుండదని జడ్పీటీసీ శివయాదవ్ భూమి యజమానులకు సూచించారు. సోమవారం మండలంలోని వేమవరం గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో కౌలుగుర్తింపు కార్డులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కౌలు రైతు భూయజమాని అంగీకారంతో భూమిపత్రాలు తీసుకొని ప్రభుత్వం కల్పించే వివిధరకాల సబ్సిడీ పథకాలను సద్వినియోగించుకోవాలని సూచించారు. కౌలుకార్డు కాలపరిమితి 11 నెలలు మాత్రమేనని, కేవలం పంటపై మాత్రమే కౌలుదారునికి హక్కులుంటాయని, భూమి మీద ఎలాంటి హక్కులు వుండవని, దీనివల్ల యజమానికి ఎలాంటి ఇబ్బందులు వుండవన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నేత కొలగాని శివ, ఏసుపొంగు ఆనందరావు, మోమిన్ సైదావలి, గోళ్ల గంగాధర్, పూసల సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

- నాలుగు ట్రాక్టర్లు స్వాధీనం.. ముగ్గురిపై కేసు

మాచవరం, జూన్ 24: అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అమీనుద్దీన్ సోమవారం తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా వున్నాయి. మోర్జంపాడు గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి, బెల్లంకొండ మండలం కామేపల్లి, పులిచింతల ముంపు భూముల్లో మట్టిని అక్రమంగా మోర్జంపాడు గ్రామానికి చెందిన కొంతమంది రైతుల పొలాలకు విక్రయిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని మల్లిఖార్జునరెడ్డితో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. 18 మందిపై కేసు

మాచవరం, జూన్ 24: మండల కేంద్రమైన మాచవరంలో బుడగజంగాల కాలనీలో ఇరువర్గాలు ఘర్షణ పడగా 18 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అమీనుద్దీన్ సోమవారం తెలిపారు. ఈ నెల 21వ తేదీన మండల కేంద్రంలోని బుడగజంగాల కాలనీలో ఇరువర్గాలు కుటుంబసమస్యలతో ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో ఇరువర్గాలలోని పలువురికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. అక్కడ వైద్యుల సమాచారం మేరకు ఎస్ఐ అమీనుద్దీన్ ఇరువర్గాలలోని 18 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముస్లిం యువతి వివాహానికి ఆర్థికసాయం

దాచేపల్లి, జూన్ 24: దాచేపల్లిలోని ముస్లిం యువతి వివాహానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. సోమవారం షేక్ నాయబ్ అబ్దుల్లా, షేక్ పెదలాల, టౌన్ మాబు ఆధ్వర్యంలో ఆ నగదును యువతి కుటుంబీకులు అందజేశారు.



తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికకు హాజరైన అధికారులు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జీరో అర్జీ

దాచేపల్లి, జూన్ 24: మండలంలో ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తహసీల్దార్ గీతావాణి, ఎంపీడీవో వెంకటరమణ, హౌసింగ్ ఏఇ బంగారయ్య, ఈవోపీఆర్డీ జోష్‌రాజ్, మండల సర్వేయర్ వాఘా శ్రీనివాసరావు, వీఆర్వోలు గిరి, ఖాజావలి, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ.. గతంలో ప్రతి సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరుతో నిర్వహించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ కార్యాల యంలో సంబంధిత అధికారులు ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారని, అర్జీదారులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు ఇవ్వాలని అధికారులు వివరించారు. వ్యక్తిగత, గృహ, ప్రభుత్వ సేవలపై వున్న సమస్యల గురించి ప్రజలు తహసీల్దార్ కార్యాలయంలో నేరుగా అర్జీ అందజేసి సమస్యను పరిష్కరించుకోవచ్చునని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎటువంటి అర్జీలు రాలేదని అధికారులు పేర్కొన్నారు.

టీడీపీ ప్రభుత్వంలోనే విద్యాభివృద్ధి

క్రోసూరు, జూన్ 24 : టీడీపీ ప్రభుత్వంలోనే విద్యాభివృద్ధి జరిగిందని డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ షేక్ దాచేపల్లి సైదా అన్నారు. మండలంలోని దొడ్లేరులోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం పలువురు టీడీపీ నాయకులతో కలసి స్టూడెంట్స్ కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. సీనియర్ టీడీపీ నేత మొగల్ జాన్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే ప్రయోజనాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల న్నారు. మాజీ సొసైటీ ప్రెసిడెంట్ వై.విష్ణుమూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు మొగ్గు చూపాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, యూని ఫాం, బూట్లు, మొదలైన వాటితో కూడిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యం, ఉపాధ్యాయులు సదాశివరెడ్డి, ప్రకాశరావు, లక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ శ్రీకేశ్ బీ లత్కర్ తదితరులు

మానవతా దృక్పథంతో వ్యవహరించాలి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూన్ 24: ప్రజా సమస్యల పరిష్కారవేదిక మీకోసం కార్యక్రమానికి వచ్చిన పౌరులతో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం సోమవారం ప్రారంభమైంది. మీకోసం కార్యక్రమంను ఎమ్మెల్యే అరవిందబాబు పరిశీలించారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వహిస్తున్న తొలి ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన లభించింది. ప్రజల నుంచి కలెక్టర్ తోపాటు జిల్లా రెవెన్యూ అధికారి కే వినాయకం వినతులు స్వీకరించారు. మొత్తం 50వినతులు వచ్చాయి. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఫిర్యాదులను పరిష్కరించి ప్రజల్లో నమ్మకం కల్పించాలన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నేతలతోనే ఎక్కువ సమస్యలు వచ్చాయని, వారందరికీ మేలైన సేవలు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని పరిశీలించారు. గతంలో అన్న క్యాంటీన్లు ద్వారా పేదలందరికీ కేవలం రూ.5కే కడుపు నిండా అన్నం పెట్టామని, జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పేదల నోటి దగ్గర భోజనాన్ని కూడా దూరం చేశాడన్నారు. ఇప్పుడు మళ్ళీఅన్న క్యాంటీన్లు తెరస్తామని, కార్యక్రమానికి వచ్చే ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా భోజనం, తాగునీరు, మజ్జిగ సదుపాయాలు కల్పిస్తామని అన్నారు.

మంత్రి నారా లోకేశ్‌కు శుభాకాంక్షలు



మంత్రి నారా లోకేశ్‌ను అభినందిస్తున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు

నరసరావుపేట టౌన్, జూన్ 24: రాష్ట్ర మానవ వనరుల, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రిగా సోమవారం నారా లోకేశ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నారా లోకేశ్‌ను ఆయన చాంబర్‌లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎమ్మెల్యే అరవిందబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు కాసా రాంబాబు, వైదన వెంకట్ తదితరులు

సాగర్ కాలువ మరమ్మతులు సత్వరమే చేపట్టాలి

● సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు

నరసరావుపేట టౌన్, జూన్ 24: నాగార్జునసాగర్ కుడి కాలువల పరిధిలో పూడికలు, మరమ్మతులు సత్వరమే చేపట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాసా రాంబాబు మాట్లాడుతూ నాగార్జునసాగర్ కుడికాలువల పరిధిలో పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో 126 కిలోమీటర్లు పొడవు కలిగి సుమారు 14వేల కిలోమీటర్ల పొడవు గల బ్రాంచ్, మేజర్, మైనర్ కాలువలలో 12లక్షల ఎకరాలకు నీటి సరఫరా జరుగుతుందన్నారు. కుడికాలువ పరిధిలో అన్ని కాలువలు పూడిక తీయాల్సి ఉందన్నారు. నాచు, తూటుకాడ, రబ్బరుచెట్లు కాలువల్లో నిండిపోయి అల్లుకుపోయి ఉన్నాయన్నారు. ఐదు సంవత్సరాలుగా కాలువల్లో రిపేర్లు చేయకపోవడం వలన కాలువ కట్టడాల వద్ద వర్షాల వలన కోతలకు గురయ్యాయన్నారు. కంపచెట్లు పెరిగిపోవడం, వీటివలన సాగునీటికి ఆటంకం కలుగుతుందని, ఇటువంటి పరిస్థితులలో పొలాల రైతులకు నీరు అందేపరిస్థితి ఉండదన్నారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని కాలువలను శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, షేక్ చిన్న జాన్ సైదా, చింతల పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

నరసరావుపేట లీగల్, జూన్ 24: దాడి కేసులో దిగువ కోర్టులో నేరం రుజువై అప్పీలు సమయంలో కోర్టుకు గైర్హాజరై కోర్టు జారీ చేసిన నాన్‌బెయిలబుల్ వారెంట్ రద్దుకోసం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసి, నిందితునికి రిమాండ్ విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిలకలూరిపేటకు చెందిన బాబూరావు ఓ వ్యక్తిపై దాడి కేసులో నిందితుడిగా ఉన్నాడు. విచారణలో నేరం రుజువు కావటంతో చిలకలూరిపేట కోర్టు రెండు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. నిందితుడు సదరు తీర్పుపై జిల్లా కోర్టుకు అప్పీలు చేసుకున్నాడు. జిల్లా కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా గైర్హాజరయ్యాడు. దీంతో న్యాయస్థానం బాబూరావుపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీచేసింది. సదరు వారెంట్‌ను రద్దుచేయవలసిందిగా కోరుతూ నిందితుడు సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేసుకున్నాడు. పిటిషనర్ వాదనలు విన్న న్యాయస్థానం పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ నిందితునికి రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పాత తహసీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు

రొంపిచర్ల, జూన్ 24: మండలంలోని రొంపిచర్లలో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తహసీల్దార్ కార్యాలయాన్ని పోలీసు క్వార్టర్స్‌లోకి మార్చారు. ప్రస్తుతం పాత తహసీల్దార్ కార్యాలయంలో మరమ్మతులు నిర్వహిస్తున్నారు. మరమ్మతుల అనంతరం ఇక్కడకు కార్యాలయాన్ని మార్చనున్నారు. ఈ మేరకు మండల తెలుగు దేశం పార్టీ నేతలు తహసీల్దార్‌కు తెలియజేశారు.

కౌలు రైతులకు అవగాహన సదస్సు లేవి?

రొంపిచర్ల, జూన్ 24: మండలంలోని కౌలు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించిన దాఖలాలు లేవు. గతంలో కౌలు రైతులను గుర్తించి రుణ అర్హత కార్డులను మంజూరు చేశారు. ఐతే ప్రస్తుతం సదస్సులు లేకపోవటంతో కౌలు రైతులు తాము ఏం చేయాలో తోచక అయోమయ స్థితిలో ఉన్నారు. అధికారులు స్పందించి కార్డులు మంజూరయ్యేలా చూడాలని కోరుతున్నారు.



అరవిందబాబును సత్కరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది

కేజీబీవీ పాఠశాలలో స్కూల్ కిట్ల పంపిణీ

రొంపిచర్ల, జూన్ 24: విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. మండలంలోని సంతగుడిపాడు కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు సోమవారం స్కూల్‌కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధానం ఇస్తుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్‌దారులకు ఈకేవైసీ తప్పనిసరి

వినుకొండ, జూన్ 24: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హెచ్‌పీ గ్యాస్ కనెక్షన్ కలిగిన ప్రతి ఒక్కరు తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సయ్యద్ సలీమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు సంవత్సరాలు పైబడి కాలం చెల్లిన సురక్షా పైపు కోసం ఏజెన్సీ సిబ్బందిని సంప్రదించి, కేవలం రూ.190 చెల్లించి, పైపును మార్చుకోవాలన్నారు. పూర్తి వివరాలను అందుబాటులో ఉన్న గ్యాస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మౌలిక వసతులపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



పట్టణంలోని శివ ప్రియనగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటికి మెమోరాండం ఇస్తున్న కాలనీ వాసులు

చిలకలూరిపేట అర్బన్, జూన్ 24: ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలో పూర్తిగా నిరాదరణకు గురైన పట్టణ ప్రాంత మౌలిక వసతుల కల్పనపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట పట్టణం, శివప్రియన నగర్ వాసులు సోమవారం ప్రత్తిపాటిని ఆయన నివాసంలో కలసి దీనిపై వినతిపత్రం అందజేశారు. పట్టణవాసులకు తాగునీరు నుంచి రహదారులు, గృహ నిర్మాణం వరకు అన్ని విషయాల్లో ఇకపై ప్రజలు స్పష్టమైన మార్పులు చూస్తారన్నారు. మరీ ముఖ్యంగా తాగునీటి వ్యవస్థ పూర్తిస్థాయిలో మెరుగుపరిచి ప్రజారోగ్యానికి భరోసా అందిస్తామని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. పట్టణం నుంచి గణపవరం వెళ్ళే మార్గంలో ఉన్న శివప్రియనగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అక్కడి వాసులు విన్నవించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, రహదారులు ఏర్పాటు చేయాలని ప్రత్తిపాటి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ప్రత్తిపాటి వారికి హామీ ఇచ్చారు. గడిచిన ఐదు సంవత్సరాలుగా నిధుల కేటాయింపులో వైసీపీ ప్రభుత్వ అలసత్వం కారణంగా పట్టణాల్లో సమస్యలు పేరుకుపోయాయన్నారు. వచ్చిన అరకొర నిధులు దారి మళ్ళించటం, వారి కమిషన్‌ల కక్కుర్తికే సరిపోవటం వల్ల ప్రజల సమస్యలు తీర్చే నాధుడే లేకపోయాడన్నారు. ఇకపై అలాంటి పరిస్థితి ఉండదని, గ్రామీణ, పట్టణ ప్రాంత స్థానిక సంస్థల నిధులన్నీ అక్కడి అవసరాలకే కూటమి ప్రభుత్వం ఖర్చు చేస్తుందని, ఆగిపోయిన అభివృద్ధి పనులన్నీ తిరిగి పట్టాలు ఎక్కిస్తామని ప్రత్తిపాటి వారికి హామీ ఇచ్చారు.

అత్యధిక మార్కులు సాధించే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తాం

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, పక్కన మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

వినుకొండటౌన్, జూన్ 24: ప్రభుత్వ పాఠశాల్లో చదివే టాప్-5 విద్యార్థులకు శివశక్తి లీలా అండ్ అంజన్ పౌండేషన్ ద్వారా మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందచేస్తామని, 100కు 100 శాతం పాస్ పర్సంటేజి అందించిన, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులకు సన్మానం, తగిన పారితోషకం అందిస్తామని వినుకొండ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. స్థానిక జడ్పీ బాలికల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధాన ఉపాధ్యాయురాలు నాగలక్ష్మి అధ్యక్షతన విద్యార్థులకు నోట్, టెస్టు బుక్స్, బ్యాగులు సోమవారం ఆంజనేయులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న నారా లోకేశ్, రానున్న ఐదు సంవత్సరాల్లో విద్యార్థులకు అవసరమైన వనరులతో పాటు, ఉపాధ్యాయుల నియామకం, సకాలంలో పుస్తకాలు పంపిణీతో పాటు, నాణ్యమైన విద్యను అందిస్తామని తెలిపారు. బాలికల పాఠశాల్లో ఇప్పటికే 1500మంది విద్యార్థులు చదువుతున్నారని, త్వరలో ఎస్ఎస్‌సీ కాలనీ ఆవరణలో జడ్పీ పాఠశాలకు అనుమతులు తీసుకువచ్చి, విశాలమైన ఆటస్థలం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా పోటీ పడుతున్న బాలికల పాఠశాలను అన్ని విధాలుగా ఆదుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం పాతముద్ర ఉన్న పుస్తకాలను పంపిణీ చేశారంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం సంతోషకరమన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం నిర్మించే ప్రభుత్వమే గాని, కూల్చే ప్రభుత్వం కాదన్నారు. 10 తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన గాయత్రితో పాటు పలువురు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు జఫ్రుల్లా, లక్ష్మీ ప్రసన్న, కౌన్సిలర్ రెడ్డి నాగపద్మ, ఆయూబ్ ఖాన్, పత్తి పూర్ణ, గందం కోటి, గుడివాడ గుర్నాధం, గుడివాడ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు అభివృద్ధికి చేయూతనివ్వండి

సీఎంకు పల్నాడు ఎమ్మెల్యేల వినతి



డీజీపీ తిరుమలరావును కలసి బొకే అందిస్తున్న ఎమ్మెల్యేలు ప్రవీణ్, ఆంజనేయులు, శ్రీనివాసరావు, పుల్లారావు, బ్రహ్మారెడ్డి, అరవిందబాబు

వినుకొండటౌన్, జూన్ 24: పల్నాడు అభివృద్ధికి అన్ని విధాలా తోడ్పాటును అందించాలని సీఎం నారా చంద్రబాబు నాయుడుకు పల్నాడు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు విన్నవించారు. రాష్ట్ర మంత్రి మండలి తొలి సమావేశం, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన పలు కీలక నిర్ణయాలకు ఆమోదం నేపథ్యంలో పల్నాడు జిల్లాలోని తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులతో పాటు వినుకొండ శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సచివాలయంలో సోమవారం రాత్రి కలిశారు. అధికారంలోకి రాగానే పింఛన్లను రూ.4వేలు చేయటం, మూడు నెలలు బకాయిలు కలిపి జూలై 1వ తేదీన ఇంటికే 7 వేల అందిస్తామన్న మాటపై ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వాటితో పాటు మిగిలిన నిర్ణయాలన్నింటికీ క్యాబినెట్ ఆమోదంతో హామీలు అమలుకు మార్గం సుగమం అయిందని, ఇదేస్ఫూర్తితో అయిదేళ్లు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పల్నాడు ప్రాంత అభివృద్ధికి చేయూతనివ్వాలని, కీలకమైన వాటర్ గ్రిడ్, వరికపూడిశల ప్రాజెక్టు తదితర విషయాలపై చర్చించినట్లు జీవీ తెలిపారు. అయిదేళ్లలో పల్నాడులోని కొన్ని ప్రాంతాలను రావణకాష్టంగా మార్చిన అరాచక శక్తులను ఉక్కు పాదంతో అణిచివేయాలని రాష్ట్ర డీజీపీని పల్నాడు జిల్లాలోని శాసనసభ్యులు రాష్ట్ర డీజీపీని సోమవారం రాత్రి కలిసి విజ్ఞప్తి చేశారు.

ఐదు సంతకాలతో నవశకానికి ఆరంభం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జూన్ 24: రాష్ట్ర తొలి మంత్రివర్గ సమావేశంలోనే ముఖ్యమంత్రి మొదటిరోజు చేసిన ఐదు సంతకాలకు ఆమోదంతో నవశకానికి నిజమైన ఆరంభం పలికారని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హర్షం వ్యక్తం చేశారు. ఐదు సంతకాల ఆమోదంతో పాటు ఆరోగ్య విశ్వ విద్యాలయానికి ఎన్టీఆర్ పేరు పునరుద్ధరించాలన్న నిర్ణయంతో తెలుగువారి ఆత్మ గౌరవాన్ని కాపాడారని, ముఖ్యమంత్రికి, మంత్రి మండలికి ప్రత్తిపాటి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 65లక్షల మందికి 1వ తేదీనే రూ.7వేలు చొప్పున ఇంటికి పింఛన్ అందించనుండటం ద్వారా భారతదేశ సంక్షేమ చరిత్రలోనే కూటమి ప్రభుత్వం సరికొత్త రికార్డు సృష్టించనున్నదన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను అంతే స్ఫూర్తితో నిలబెట్టుకుంటున్న ఇలాంటి ప్రభుత్వంలో భాగస్వామ్యం అయినందుకు ఎంతో గర్వపడుతున్నట్టు ప్రత్తిపాటి తెలిపారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోండి: డీజీపీకి వినతి

పెదకూరపాడు, జూన్ 24: వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడిన వ్యక్తులు, సంఘ విద్రోహ శక్తులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ పల్నాడు ఎమ్మెల్యేలు డీజీపీ ద్వారక తిరుమలరావుకు విన్నవించారు. డీజీపీ కార్యాలయంలో సోమవారం డీజీపీ ద్వారక తిరుమలరావును పల్నాడు జిల్లా ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల అనంతరం హింస, తదనంతర పరిస్థితులపై చర్చించారు. ముఖ్యంగా మైనింగ్, ఇసుక అక్రమ రవాణ, మద్యం అక్రమాలపై, ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన ప్రతి ఒక్కరిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. డీజీపీని కలసినవారిలో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబులు ఉన్నారు.

వారం రోజుల వ్యవధిలో ఐదు ప్రమాదాలు

● ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు

● ప్రమాదాలపై పట్టించుకోని అధికారులు



ప్రమాదాలకు నిలయంగా మారిన లయోలా పాఠశాల వద్ద ఉన్న జాతీయ రహదారి మలుపు

వినుకొండ టౌన్, జూన్ 24: నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు రహదారి ప్రమాదాలకు నిలయంగా మారాయి. గడిచిన ఐదు సంవత్సరాలలో వినుకొండ మండలంలోని శివాపురం, పార్వతీపురం, కొత్తపాలెం జాతీయ్య రహదారితో పాటు, నర్సరావుపేట రోడ్డులోని నాగిరెడ్డిపల్లి రోడ్డు ప్రమాధాలు నిలయంగా మారాయి. గడిచిన వారం రోజుల వ్యవధిలో రెండు నిండు ప్రాణాలు గాలిలో కలవగా, మరో ఇద్దరికి చిన్నారులకు గాయాలైన సంఘటన నాగిరెడ్డిపల్లి సమీపంలోని లయోలా పాఠశాల వద్ద స్థానికులను భయాందోళన కలిగిస్తుంది. ఒకేరోజు బైలదుగు హరిబాబు, సౌభాగ్యరాజు గాయాలతో వైద్యశాల్లో చికిత్స పొందుతూ మృతి చెందగా, పాఠశాల విరామ సమయంలో యోగిత, యోగేష్‌లకు రోడ్డు ప్రమాదంలో గాయాలైయ్యాయి. ఇలా చెప్పుకుంటూ పోతే గడిచి ఆరు నెలల వ్యవధిలో 10మంది ఈప్రాంతంలో గాయాలై, ప్రాణాలు కోల్పోయారని స్థానికులు చెబుతున్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా నిర్మలా తెలుగు, ఇంగ్లీష్ మీడియంలతో పాటు, లయోలా బాలుర పాఠశాల, బీసీ హాస్టల్ తదితర పాఠశాలలకు చెందిన వేలమంది విద్యార్థులు రోడ్డు మార్గం నుంచి వెళుతూ విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల పనిదినాల్లో వినుకొండ-గుంటూరు జాతీయ రహదారి ప్రాంతమంతా పిల్లలతో రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రోడ్డుపై మీతి మీరిన వేగంతో ప్రయాణించే వాహనాల తాకిడికి తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు చొరవ చూపి లయోల, నిర్మలా పాఠశాలల వద్ద తరచూ జరిగే ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని బాధిత బంధువులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదం కేసులో శిక్ష ఖరారు

నరసరావుపేట లీగల్, జూన్ 24: లారీని నిర్లక్ష్యంగా నడిపి ఎదురుగా ఆగి ఉన్న మరొక లారీని ఢీకొట్టి ఒక వ్యక్తి మృతికి, మరికొందరి గాయాలకు కారకుడైనట్టు నేరం రుజువవ్వటంతో దిగువకోర్టు విధించిన ఒక ఏడాది జైలు శిక్ష, రూ.2వేలు జరిమానాను యధాతధంగా ఖరారు చేస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. 2015 ఏప్రిల్ 14న ప్రకాశం జిల్లా కందుకూరు నుంచి మండలంలోని కాకానికి చెందిన బొజ్జా రాంబాబు లారీలో బాతులతో వస్తూ మండలంలోని లక్ష్మీపురం వద్ద ఎదురుగా ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అదేలారీలో ఉన్న కట్టా వెంకయ్య మృతి చెందగా మరి కొందరికి గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న రూరల్ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడైన బొజ్జా రాంబాబును అరెస్టుచేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువవ్వటంతో పైవిధంగా శిక్షను విధిస్తూ దిగువ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. నిందితుడు జిల్లా కోర్టుకు అప్పీలు చేసుకున్నాడు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం దిగువకోర్టు తీర్పును యధాతథంగా ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది.

పచ్చిరొట్ట సాగుతో భూసారం రక్షించుకోవచ్చు: ఏవో

ఈపూరు, జూన్ 24: పచ్చిరొట్ట పంటలను సాగుచేయడం వలన నేల సారాన్ని కాపాడుకోవచ్చునని మండల వ్యవసాయాధికారి ఆర్ రామారావు అన్నారు. మండలంలోని గుండేపల్లి, వనుకుంట గ్రామాలలో సోమవారం కౌలుదారులకు పంట సాగు హక్కు పత్రం ఉపయోగాలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రామారావు మాట్లాడుతూ ప్రతి కౌలురైతు తప్పనిసరిగా కౌలు రైతు కార్డును పొందాలన్నారు. కార్డు ఉన్నవారికి పంటనష్టం జరిగితే వారిని ఆదుకోవడం కోసం ప్రభుత్వం అందించే విత్తనాలు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కే మల్లికార్జునరావు, బీ సుబ్బయ్య, వీఆర్వోలు నాసర్ సాహెబ్, వెంకటేష్, వ్యవసాయ విస్తరణాధికారి బండి అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ కోదండ రామాలయ వార్షికోత్సవం

నాదెండ్ల, జూన్ 24: మండలంలోని గణపవరంలో సోమవారం కోదండ రామాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారులు దర్శి ఉమా మహేశ్వరశర్మ, అనీల్ కుమార్‌శర్మలు స్వామి వార్లకు అభిషేకాలు, అర్చనలు చేశారు. యాగశాలలో శాంతి హోమాలు నిర్వహించారు, అనంతరం అన్నదానం జరిగింది.

ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నరసరావుపేట లీగల్, జూన్ 24 : పల్నాడు జిల్లా కేంద్రం నరరావుపేట ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 31 ఫిర్యాదులు ఎస్పీ మాలిక గార్గ్‌కు అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పరిష్కరించేలా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదు దారుని సమస్యపై శ్రద్ధ వహించి నిర్ణీత గడువులోగా పరిష్కరించడానికి కృషి చేయాలని ఎస్పీ ఆదేశించారు.



పైపులను పరిశీలిస్తున్న ప్రజారోగ్యశాఖ ఎస్పీ శ్రీనివాసులు, ఏఐఐబీ అధికారి ప్రభు, ఇతర అధికారులు

తాగునీటి పనులకు తొలి అడుగు

● త్వరలో పనులు ప్రారంభం

● 2026 నాటికి పనులు పూర్తిచేస్తామన్న అధికారులు

వినుకొండ టౌన్, జూన్ 24: వినుకొండలో 159 కోట్ల రూపాయలతో ఆగిపోయిన తాగునీటి పథకం పనులను 2026 నాటికి పూర్తి చేస్తామని ప్రజారోగ్యశాఖ ఎస్పీ ఎన్.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు అధికారులతో కలిసి పట్టణంలో ఎన్ఎస్పీ కాలనీ, గాయత్రి నగర్‌లో ఆగిపోయిన తాగునీటి ట్యాంక్ నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్ల, పిడుగురాళ్ళతో పాటు వినుకొండలో 159 కోట్ల రూపాయలతో సింగర చెరువును పునర్నిర్మించి, నూతన పైప్‌లైను ఏర్పాటుచేసి ప్రతి ఇంటికి కుళాయి ద్వారా నీరు అందించడం జరుగుతుందన్నారు, ఆయనతో పాటు ఏఐబీ అధికారి ప్రభు, మున్సిపల్ అధికారులు ఎ.శ్రీనివాసరెడ్డి, వినుకొండ డీఈఈ వెంకయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

లింగంగుంట్లలో చిన్నారిపై అత్యాచారం

నరసరావుపేట రూరల్, జూన్ 24: మండలంలోని లింగంగుంట్ల పంచాయతీలో సోమవారం ఐదేళ్ళ చిన్నారిపై కొమరోలు చందు అనే యువకుడు అత్యాచారం చేశాడు. నరసరావుపేట రూరల్ ఎస్ఐ రోశయ్య తెలిపిన వివరాల ప్రకారం ఓ మహిళ సోమవారం తన ఐదేళ్ళ కుమార్తెను ఇంటి వద్ద ఉంచి కూలిపనికి వెళ్లింది. దీంతో కొమరోలు చందు అనే యువకుడు ఆ చిన్నారిపై అత్యాచారం చేశాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లికి ఆ చిన్నారి జరిగిన సంఘటనను తెలియజేయటంతో తల్లి నరసరావుపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గురజాల డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు తన బృందంతో కామాంధుడిని పట్టుకుని ఫోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి సోమవారం సాయంత్రం కోర్టుకు హాజరుపరిచారు.

అగ్ని బాధితులకు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చేయూత

వినుకొండటౌన్, జూన్ 24: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన శ్రీనివాసరావు కుటుంబానికి శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు చేతుల మీదుగా నిత్యావసర సరుకులు, వంట సామాగ్రి, దుస్తులతో పాటు ఆర్థిక సాయం అందచేశారు. అనంతరం లీలావతి మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ, రాజకీయాలకు అతీతంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డులోని టీడీపీ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ఇది ఇలావుండగా జనసేనపార్టీ నియోజకవర్గం నాయకులు కొంజేటి నాగశ్రీను రాయల్ అగ్ని ప్రమాదబాధితులను పరామర్శించి రూ.10,000 ఆర్థికసాయం అందచేసి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



పాదయాత్రను ప్రారంభిస్తున్న జీవీ సతీమణి లీలావతి

శ్రీశైలానికి టీడీపీ శ్రేణుల పాదయాత్ర

● జీవీ సతీమణి లీలావతి సంఘీభావం

బొందిలిపాలెం (శావల్యాపురం) జూన్ 24: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి చారిత్రాత్మకమైన విజయాన్ని సాధించడంపై శావల్యాపురం మండలం బొందిలిపాలెం గ్రామానికి చెందిన తెలుగింటి ఆడపడుచులు మొక్కులు తీర్చుకునేందుకు శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. సోమవారం శావల్యాపురం మండలం బొందిలిపాలెం గ్రామానికి చెందిన మహిళలు వినుకొండ-శ్రీశైలం వెళ్ళే మార్గంలోని కుంట దగ్గర నుంచి పాదయాత్రను ప్రారంభించారు. వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సతీమణి, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి బొందిలిపాలేనికి విచ్చేసి టీడీపీ జెండాను ఊపి పాదయాత్రను ప్రారంభించారు. మహిళలతో కలసి కొంత దూరం పాదయాత్ర చేశారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, నరసరావుపేట ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయులు, వినుకొండ ఎమ్మెల్యేగా జీవీ ఆంజనేయులు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా తొలుత బొందిలిపాలెంలోని అడవి పేరంటాలమ్మ దేవాలయం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లీలావతి మాట్లాడుతూ కూటమి గెలుపు కోసం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మొక్కుబడులు తీర్చుకునేందుకు వెళ్లటంపై సంతోషం వ్యక్తంచేసి కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు యరమాసు కోటేశ్వరరావు, గడిపూడి విశ్వనాధం, గోరింట్ల హనుమంతరావు, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల వెంకటేశ్వర్లు, గ్రామపార్టీ అధ్యక్షులు పొనుగోటి వెంకట్రావు, మాజీ అధ్యక్షులు సోమేపల్లి వెంకట్రావు, తెలుగు యువత చింతా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలుహక్కుల వేలం

చెంఘీజ్‌ఖాన్‌పేట (యడ్లపాడు), జూన్ 24: యడ్లపాడు మండలం చెంఘీజ్ ఖాన్‌పేట గ్రామంలోని పురాతన వెన్నముద్దల వేణుగోపాలస్వామి దేవస్థానం భూముల కౌలు హక్కుల వేలంను దేవదాయశాఖ అధికారులు సోమవారం నిర్వహించారు. దేవస్థానానికి చెందిన 15.24ఎకరాల భూమికి ఏడాది కాలానికి కౌలు హక్కుల వేలంను నిర్వహించగా గ్రామానికి చెందిన రైతులు రూ.2.89లక్షలకు కౌలు హక్కులను దక్కించుకున్నారు. గత ఏడాది రూ.84,500 ఆదాయంకన్నా రూ.2,05,500 అధికంగా ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ ఈవో శివయ్య, జూనియర్ సహాయకుడు కృష్ణప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

గ్రేడు-5 కార్యదర్శులకు అధికారం ఇవ్వటంపై హర్షం

నాదెండ్ల, జూన్ 24: గ్రేడు-5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వటంపై సాతులూరు పంచాయతీ కార్యదర్శి, రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.రమేష్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఉత్తర్వులతో పంచాయతీల్లో గ్రేడు-5 కార్యదర్శులకు పూర్తి పరిపాలన బాధ్యతలు దక్కాయన్నారు. చెక్ పవర్‌తో పాటు ఆర్థిక సంబంధిత లావాదేవీలకు అధికారం లభించిందన్నారు. ఈ అధికారంతో గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించే లక్ష్యం సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు ప్రతిష్టలు తెస్తామని, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా తామంతా చిత్తశుద్ధితో పనిచేస్తామని తెలిపారు.